www.citytimesnews.com

# సిటీ టైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 26 | సంచిక - 85 | హైదరాబాద్ | శుక్రవారం | తేదీ:27.03.2026 | పేజీలు 8 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

## మరో 4 రోజులు రాష్ట్రంలో వర్షాలు

- హైదరాబాద్ సహా పలు జిల్లాలకు
- వాతావరణ శాఖ హెచ్చరికలు
- బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి
- వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది

6లో..

## 217 కోట్ల జీఎస్టీ స్కాం

- తెలుగు రాష్ట్రాలలో 72 షెల్ కంపెనీలు గుర్తింపు..!
- కేవలం కాగితాల మీద మాత్రమే ఉండి..
- వ్యాపార కార్యకలాపాలు లేకుండా
- తప్పుడు ఇన్వాయిస్ లను సృష్టించి ఐటీసీ క్లెయిమ్

6లో..

### నేడు అన్ని రాష్ట్రాల

## సీఎంలతో మోదీ భేటీ

- వర్చువల్‌గా ప్రధాని సమావేశం
- ఇరాన్ యుద్ధ నేపథ్యంలో చర్చ
- ఇంధన సరఫరాపై సమీక్ష

7లో..



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం నేపథ్యంలో దేశంపై దాని ప్రభావం, పరిణామాలపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశం కానున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎంలతో ప్రధాని మాట్లాడనున్నారు. పశ్చిమాసియా సంఘర్షణపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ అంశంపై ప్రధాని.. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ మాట్లాడారు. కరోనా కాలం నాటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రులతో ప్రధాని సమావేశం కానుండటంతో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారు? ఏం సూచనలు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

### మార్కాపురం బస్సు ప్రమాదం

## 13 మంది సజీవ దహనం

- రిపేర్ చేసిన కొంత సేపటికే ఘోరం
- గంట పాటు దానికి రిపేర్లు చేసి..
- తిరిగి బయల్దేరిన కొద్దిసేపటికే ఈ ఘోరం
- రాష్ట్రపతి, ప్రధాని, ఇరు రాష్ట్రాల సీఎంలు దిగ్భ్రాంతి
- మరో 22 మందికి తీవ్ర గాయాలు
- రాయవరం సమీపంలోకి రాగానే..

8లో..



**మార్కాపురం, సిటీ టైమ్స్**

గురువారం ఉదయం.. మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం.. తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా వణికించింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా నుంచి 35 మందితో వెళ్తున్న హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఆ ప్రైవేటు బస్సు.. రాయవరం సమీపంలోకి రాగానే పలకల క్వారీ వద్ద టిప్పర్‌ను ఢీకొట్టడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనం అయ్యారు. మరో 22 మందికి తీవ్ర గాయాలు అయినట్లు అధికారులు వెల్లడించారు. వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అయితే ఈ బస్సు ప్రమాదం.. బాధిత కుటుంబాలకు అంతులేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఇప్పటి దాకా 13 మంది మృతదేహాలను బయటికి తీశారు. ఇక ఈ బస్సు ప్రమాదానికి సంబంధించి తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బస్సు కండీషన్ సరిగా లేదని.. ప్రమాదానికి ముందే అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆ బస్సు పరిస్థితి బాగా లేదని ముందే డ్రైవర్‌తో చెప్పారు. ఈ క్రమంలోనే యర్రగొండపాలెం వద్ద బస్సును గంట సేపు నిలిపేసిన డ్రైవర్.. దానికి మరమ్మతులు చేసినట్లు ప్రయాణికులు వెల్లడించారు. రిపేర్ల తర్వాత బస్సు బయల్దేరి కొంత దూరం వెళ్లిన తర్వాత రాయవరం వద్ద ఈ ఘోర ఘటన జరిగినట్లు చెప్పారు. ఈ ప్రమాదం తర్వాత అధికారులు బస్సు డ్రైవర్‌ను విచారణ జరపగా.. స్టీరింగ్ స్ట్రక్ అయినట్లు చెప్పినట్లు సమాచారం.

### జీఎస్టీ సవరణ బిల్లుకు

## అసెంబ్లీ ఆమోదం

- ప్రస్తుతం ఉన్న 'సేల్స్ టాక్స్ కమిషనర్' పోస్టు
- ఇకపై 'చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్'గా మార్పు
- అదనపు కమిషనర్ (గ్రేడ్-1) హోదాను
- 'స్టేట్ టాక్స్ కమిషనర్'గా మారుస్తూ చట్ట సవరణ

5లో..



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ శాసనసభలో వస్తు సేవల పన్ను చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లుపై విస్తృత చర్చ జరిగిన అనంతరం, సభ ఏకగ్రీవంగా దీనిని ఆమోదించింది.

### విద్య, వైద్య రంగానికి

## అత్యధిక ప్రాధాన్యం



- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేదు
- ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ
- అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం
- గతంలో జరిగిన తప్పలను సరిదిద్దుకుంటూనే
- నిరుపేదలకు నాణ్యమైన వైద్యం
- రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పలను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసనసభ ముందు వివరించారు.

8లో..

శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అనేక అంశాలను తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నామన్నారు. పేదలకు జీవిత బీమాను అందించి వారిలో ధీమా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోందని వెల్లడించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి ఏం చెప్పారంటే**

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరగ్య శ్రీ కింద ప్రతి నెలా సగటున రూ. 52 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత 7 డిసెంబర్ 2023 నుంచి 25 మార్చి 2026 కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెట్టింది. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టింది. ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. 7 డిసెంబర్, 2023 నాటికి గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ. 600.27 కోట్లు. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 360.16 కోట్ల బకాయి ఉంది.

## వైన్ షాపులకు పెట్టిన దేవుళ్ల పేర్లను తొలగించాలి

- బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- కొత్తగా చట్టం తీసుకురావాలి
- హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారు

7లో..



## నీరవ్ మోడీకి భారీ షాక్

- భారత్‌కు అప్పగింతకు గ్రీన్ సిగ్నల్
- రూ. 13,000 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం
- 2019 మార్చి 19 నుంచి లండన్ జైలులో

6లో..



### తెలంగాణలో పెట్రోల్,

## ఎల్పీజీ కొరత లేదు

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర
- పెట్రోల్ బంకుల వద్ద రద్దీ నేపథ్యంలో
- ఇంధన నిల్వలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్
- ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం



**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. పెట్రోల్ బంకుల వద్ద రద్దీ నేపథ్యంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇంధన నిల్వలపై ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వదంతులు చూసి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

6లో..

### దేశంలోనే బెస్ట్

## సిటీ హైదరాబాద్

- నివసించడానికి అత్యంత అనుకూల నగరం
- ఈజ్ ఆఫ్ లివింగ్‌లో అగ్రస్థానం
- బెంగళూరును వెనక్కి నెట్టిన హైదరాబాద్
- ఆర్థిక వృద్ధి, కార్యాలయాల విస్తరణ



**హైదరాబాద్, సిటీ టైమ్స్**


హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతూ విశ్వనగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. నగరంలో ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన వారు కూడా నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఈ మేరకు హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని మెట్రో నగరాలన్నింటిని వెనక్కి నెట్టి 'నివసించడానికి అత్యంత అనుకూలమైన నగరం'గా అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ సంస్థ అన్‌బాక్సింగ్ బీఎల్ఆర్ తాజాగా విడుదల చేసిన 'WeAreCity 2026' నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

8లో..

## భారత్.. పాకిస్థాన్ లాంటి 'బ్రోకర్ దేశం' కాదు

- ఇరాన్ మధ్యవర్తిత్వంపై
- జైశంకర్ సంచలన వ్యాఖ్యలు

8లో..





## లింక్ రోడ్లు నిలిచే...
# ట్రాఫిక్ ముంచే

**- అసెంబ్లీలో శేరిలింగంపల్లి సమస్యలపై గాంధీ గళం**
**- నిలిచిపోయిన ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్**

**శేరిలింగంపల్లి, మార్చి 26 (సిటీటైమ్స్):**

రాష్ట్ర ఐటీ హబ్‌గా వేగంగా విస్తరిస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ తీవ్రమవుతుండగా, దానికి ఉపశమనం కల్పించాల్సిన లింక్ రోడ్లే సగం దశలో నిలిచిపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. జనాభా, వాహనాల సంఖ్య వేగంగా పెరుగుతున్న ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు అదే వేగంతో పూర్తి కాకపోవడం ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో పీఏసీ చైర్మన్‌గా మాట్లాడిన ఆయన, గతంలో మంజూరైన నాలుగు నుంచి ఐదు కీలక లింక్ రోడ్ల పనులు సగం దశలోనే ఆగిపోవడం వల్ల ట్రాఫిక్ ఒత్తిడి మరింత పెరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా హైటెక్ సిటీ గౌసియా కేఫ్ నుంచి కొత్తగూడ హర్ష టయోటా వరకు 100 అడుగుల రహదారి, అపర్ణ హిల్ పార్క్ నుంచి గంగారాం హనుమాన్ దేవాలయం వద్ద జాతీయ రహదారికి కలిపే లింక్ రోడ్డు, నల్లగండ్ల రత్నదీప్ సూపర్‌మార్కెట్ నుంచి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం వరకు లింక్ రోడ్డు, ఎన్‌హెచ్-65 మైహోమ్ జ్యువెల్ నుంచి రైల్వే ట్రాక్ మీదుగా జోనల్ కార్యాలయానికి కలిపే ఫ్లైఓవర్ వంటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ పనులను ప్రథమ ప్రాధాన్యంగా గుర్తించి తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరిన గాంధీ, లింక్ రోడ్లు పూర్తైతే ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గి, ప్రయాణ సౌలభ్యం మెరుగుపడుతుందని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో మౌలిక వసతులు ఆలస్యం అయితే అభివృద్ధి అర్ధాంతరంగా మిగిలిపోతుందని హెచ్చరించారు.

## ముల్కనూర్ బస్టాండ్
# ఎదురుగా వైన్ షాప్



**- మందుబాబులకు పొంచి ఉన్న ప్రమాదం**

**భీమదేవరపల్లి, మార్చి 26 (సిటీ టైమ్స్)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి ముల్కనూర్ బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ కూడలి నిర్వహిస్తున్న వైన్ షాప్ వల్ల మందు బాబులకు పెను ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు హనుమకొండ సిద్దిపేట ప్రధాన రహదారిపై ఉన్నాము ముల్కనూర్ బస్టాండ్ కూడలిలో వాహనాల రాకపోకలతో ప్రతినిత్యం రద్దీగా ఉంటోంది. దీనికి తోడు రోడ్డు పనుల విస్తరణ జరుగుతోంది ఈ పరిస్థితులలో వైన్ షాప్ నిర్వహణతో ప్రజలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది ఏడాది కాలంలోనే పలు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఎంతోమంది గాయాల పాలు అయినట్లు గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు అయినప్పటికీ పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి వైన్ షాపు ను బస్టాండ్ కూడలికి దూరంగా తరలించాలని ఈ విషయంపై స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు లేనియెడల రాజకీయాల కు అతీతంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని ముల్కనూర్ గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు

## పెద్దమందడిలో కోట్ల చంద్రయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన: జంగం పద్మ శివ

**పెద్దమందడి సిటీ టైమ్స్ మార్చి 26**

గురువారం రోజు పెద్దమందడి మండల కేంద్రంలో కోట్ల చంద్రయ్య బుధవారం రోజు చనిపోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న జంగం శివ వారి ఇంటి దగ్గరికి వెళ్లి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి ఓదార్పు చెపుతూ ధైర్యం చెప్పి రెండు వేల రూపాయలను ఆర్థిక సాయం అందజేసి అందించారు ఈ కార్యక్రమంలో జంగం శివ, జంగం రమేష్, చాకలి బాలరాజ్, సాకలి లక్ష్మీనారాయణ, లు పాల్గొని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. వారి కుటుంబ సభ్యులు మానవత స్ఫూర్తిగా జంగం శివకు అభినందనలు తెలిపారు.



## ఈ స్పోర్ట్స్ నేషన్స్ కప్–2026కు
# నాడ్విన్ గేమింగ్ జాతీయ జట్టు భాగస్వామ్యం

**- భారత్ అధికారిక భాగస్వామిగా ఎంపిక**
**- రియాద్‌లో నవంబర్ 2 నుంచి 29 వరకు పోటీలు**

**హైదరాబాద్, మార్చి 26 (సిటీటైమ్స్):**






గేమింగ్, ఈ స్పోర్ట్స్, యువత వినోద రంగాల్లో గ్లోబల్ స్థాయిలో ముందంజలో ఉన్న నాడ్విన్ గేమింగ్‌ను, ఈ స్పోర్ట్స్ నేషన్స్ కప్-2026 కోసం భారత్ జాతీయ జట్టు అధికారిక భాగస్వామిగా ఈ స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఈఎఫ్) ఎంపిక చేసినట్లు ప్రతినిధులు వెల్లడించారు. దేశాల మధ్య జరిగే ఈ అంతర్జాతీయ పోటీలు సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నవంబర్ 2 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత దశాబ్దంగా దేశంలో ఈ స్పోర్ట్స్ అభివృద్ధికి నాడ్విన్ గేమింగ్ కీలకంగా పనిచేస్తూ, జాతీయ స్థాయి టోర్నీల నిర్వహణ, పబ్లిషర్ ఆధారిత సర్క్యూట్‌ల అమలు, ప్లేయర్లు-క్రియేటర్లు-భాగస్వాముల మధ్య వారధిగా నిలుస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత జట్టు పోటీతత్వాన్ని పెంపొందించేందుకు జట్టు నిర్మాణం, పోటీ వాతావరణం సృష్టించడం, గేమ్ టైటిల్స్‌కు అనుగుణంగా కోచ్‌లకు మద్దతు, పబ్లిషర్లతో సమన్వయం వంటి అంశాల్లో నాడ్విన్ గేమింగ్ కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. ఈ స్పోర్ట్స్ ఫౌండేషన్ గ్లోబల్ హెడ్ నిమిష్ రౌత్, నాడ్విన్ గేమింగ్ డైరెక్టర్ హాన్స్ జాగ్నో సంయుక్త ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. ఈఎన్‌సీ-2026 కోసం మొత్తం రూ.414 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. ఇందులో 16 గేమ్ టైటిల్స్‌కు సంబంధించిన ప్లేయర్లు, కోచ్‌ల ప్రైజ్‌మనీగా రూ.184 కోట్లు కేటాయించగా, క్లబ్ ప్రోత్సాహకాలకు రూ.46 కోట్లు, జాతీయ జట్టు అభివృద్ధికి మరో రూ.184 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అన్ని టైటిల్స్‌కు సమాన ప్రైజ్‌మనీ ప్రకటించగా, అగ్రస్థానంలో నిలిచే ప్లేయర్‌కు సుమారు రూ.46 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ.28 లక్షలు, తృతీయ స్థానానికి రూ.14 లక్షలు లభించనున్నాయి.ఈ టోర్నీలో చెస్, పబ్‌జీ మొబైల్, రాకెట్ లీగ్, డోటా-2, వాలొరెంట్, కౌంటర్ స్ట్రైక్-2, పబ్‌జీ బ్యాటిల్‌గ్రౌండ్స్, ఫాటల్ ఫ్యూరీ, లీగ్ ఆఫ్ లెజెండ్స్, ట్రాక్‌మానియా, టామ్ క్లాన్సీస్ రెయిన్‌బో సిక్స్ సీజ్, ఈఏ స్పోర్ట్స్ ఎఫ్‌సీ-26, మొబైల్ లెజెండ్స్, బ్యాంగ్ బ్యాంగ్, హానర్ ఆఫ్ కింగ్స్, అపెక్స్ లెజెండ్స్ వంటి గేమ్స్ చోటు చేసుకున్నాయి. నవంబర్ 2026లో రియాద్ వేదికగా ఈఎన్‌సీ పోటీలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

# క్షయ వ్యాధిపై అపోహలే అడ్డంకి

**- వయస్సుతో సంబంధం లేకుండా వ్యాప్తి**
**- ప్రారంభ లక్షణాలు గుర్తిస్తే చికిత్స సులభం**

**హైదరాబాద్, మార్చి 26 (సిటీటైమ్స్):**



వయస్సుతో సంబంధం లేకుండా క్షయ (టీబీ) వ్యాధి విస్తరిస్తోందని కిమ్స్ గచ్చిబౌలి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పుల్మనాలజిస్ట్, స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎస్.ఏ. రఫీ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ గచ్చిబౌలిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి పూర్తిగా నివారణీయమైనదీ, చికిత్స ద్వారా పూర్తిగా కోలుకునే వ్యాధి అయినప్పటికీ, దేశంలో ఇంకా అనేక మంది దీని బారిన పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం క్షయ నిర్మూలనలో ప్రధాన అడ్డంకి చికిత్స లేమి కాదని, వ్యాధిపై ఉన్న అపోహలు, సామాజిక ముద్ర (స్టిగ్మా) ముఖ్య కారణాలని పేర్కొన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, కారణం లేకుండా బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రారంభ దశలోనే నిర్ధారణ జరిగితే సమయానికి చికిత్సతో వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని, తద్వారా వ్యాప్తి నివారించవచ్చని వివరించారు. అనంతరం కిమ్స్ కన్సల్టెంట్ పుల్మనాలజిస్ట్, స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ కడ్లి శిరీష్ కుమార్ మాట్లాడుతూ, ఏ వయస్సు, లింగం, జీవనశైలి ఉన్నవారినైనా క్షయ వ్యాధి ప్రభావితం చేయవచ్చని తెలిపారు. ఇది గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధి అని, కేవలం దగ్గు ద్వారానే కాకుండా సాధారణ శ్వాస ద్వారా కూడా వ్యాప్తి చెందే అవకాశముందని పేర్కొన్నారు. ముఖ్యంగా గాలి ప్రవాహం తక్కువగా ఉండే, జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో వ్యాప్తి వేగంగా ఉంటుందని తెలిపారు.

వైద్యుల సూచనల మేరకు క్షయ రోగులు పూర్తిగా కోలుకునే వరకు మాస్క్ ధరించడం అవసరమని, తద్వారా ఇతరులకు వ్యాధి సోకకుండా నివారించవచ్చని సూచించారు. హెచ్‌ఐవి, మధుమేహం, క్యాన్సర్, దీర్ఘకాలిక స్టెరాయిడ్ చికిత్స పొందేవారు, వృద్ధులు, ఐదేళ్లలోపు పిల్లలు, పోషకాహార లోపం ఉన్నవారు, క్షయ రోగులతో సన్నిహితంగా ఉండేవారు అధిక ప్రమాదంలో ఉంటారని తెలిపారు. ఇటువంటి వారికి టీబీ నివారణ చికిత్స ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే అరికట్టవచ్చని పేర్కొన్నారు.

## పారిశుద్ధ్యం పకడ్బందీగా...
# క్షేత్రస్థాయిలోనే ఫలితం

**- చెత్త సేకరణపై శేరిలింగంపల్లి జోన్ అధికారులతో సమీక్ష**
**- నిర్లక్ష్యం చేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరిక**

**శేరిలింగంపల్లి, మార్చి 26 (సిటీటైమ్స్):**

ఐటీ హబ్‌గా వేగంగా విస్తరిస్తున్న శేరిలింగంపల్లి జోన్‌లో పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన అధికారులకు ఆదేశించారు. గురువారం జోన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నగర శుభ్రతకు కేవలం ప్రణాళికలు కాకుండా, నేలమీద జరిగే చర్యలే కీలకమని స్పష్టం చేశారు. ఇంటి ఇంటికి చెత్త సేకరణను మరింత సమర్థంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి నుంచి నేరుగా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమర్షియల్ సంస్థలు కూడా తమ చెత్తను క్రమంగా సేకరణ వాహనాలకు ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, నిర్లక్ష్యం చేస్తే జరిమానాలు విధించాలని ఆదేశించారు. దీనిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఇంజినీరింగ్‌కు సంబంధించిన సమస్యలపై కూడా సమీక్ష నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి పనిని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. ఐటీ పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో రహదారుల నిర్వహణ కూడా అదే స్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. స్వీపింగ్ అనంతరం చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని, ఫ్లైఓవర్లపై మట్టి, ఇసుక, ఇతర వ్యర్థాలు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డీసీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా పర్యవేక్షిస్తూ లోపాలను వెంటనే సరిదిద్దాలని సూచించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్, కూకట్పల్లి జోన్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో పాటు సంబంధిత డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఎస్డబ్ల్యూఎం సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యానగర్ లో దేవతామూర్తుల
# నూతన విగ్రహాలకు సంప్రోక్షణ

**ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**

**చుంచుపల్లి , సిటీ టైమ్స్ ,**

మండల పరిధిలోని విద్యానగర్ కాలనీ ఎనిమిదో వార్డు నందు ఏర్పాటుచేసిన శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవతామూర్తుల నూతన విగ్రహాలకు అర్చకులు చేత ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు . ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు విద్యానగర్ కాలనీ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , వివిధ వార్డ్ మెంబర్స్ తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ మాలోత్ శంకర్ , వాడపల్లి జకరయ్య , పూర్ణ , రమాదేవి , నాగమణి, రజిత తో పాటు, స్థానిక మహిళలు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు .











# ‘క్లీన్ స్వీప్’తో సైబరాబాద్ శుభ్రతకు నూతన దిశ

- పటాన్‌చెరు–మణికొండ 22 కి.మీ మార్గంపై మహా శుభ్రత యజ్ఞం
- మార్చి 28న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు విస్తృత డ్రైవ్
- పనుల్లో జాప్యం సహించ బోమన్న కమిషనర్ స్పష్టం

సైబరాబాద్, మార్చి 26 (సిటీటైమ్స్):

ఐటీ కారిడార్‌గా వేగంగా విస్తరిస్తున్న శేరిలింగంపల్లి పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడి, నిర్మాణ వ్యర్థాల పేరుకుపోవడం, రహదారుల అంచుల్లో చెత్త నిల్వలు నగర రూపురేఖలను దెబ్బతీస్తున్న నేపథ్యంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కదిలింది. పటాన్‌చెరు నుంచి మణికొండ వరకు 22 కిలోమీటర్ల ప్రధాన మార్గాన్ని ఎంపిక చేసి, మార్చి 28న “సైబరాబాద్ క్లీన్ స్వీప్” పేరిట మహా శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగే ఈ డ్రైవ్‌తో నగరానికి శుభ్రతలో స్థిరమైన ప్రమాణాలు తీసుకురావాలన్నదే లక్ష్యం. ఇందుకు ముందు నిర్వహించిన సమీక్షలో కమిషనర్ స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు.

**సమీక్షలో కఠిన హెచ్చరిక... గడువుల్లో పూర్తి చేయాలన్న ఆదేశం**

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో హెచ్‌సిటీ పనులు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, బీటీ-సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, వర్షపు నీటి కాలువల నిర్మాణం, నాళాల డీసిల్టింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు, ఖాళీ స్థలాల కంపౌండ్ గోడలు, జంక్షన్ అభివృద్ధి పనులను విపులంగా పరిశీలించారు. పనులు ఆలస్యమైతే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ, నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**అర కిలోమీటరు చొప్పున విభజన... కట్టుదిట్టమైన ప్రణాళిక**

22 కిలోమీటర్ల మార్గాన్ని ప్రతి అర కిలోమీటరు చొప్పున సుమారు 44 విభాగాలుగా విభజించి, ప్రతి విభాగానికి ప్రత్యేక శానిటేషన్ సిబ్బంది, పర్యవేక్షణ అధికారి, చెత్త సేకరణ వాహనాలు కేటాయించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాల సమగ్ర శుభ్రతతో పాటు రోడ్డు అంచులు, మూలలు, డివైడర్ల వద్ద పేరుకుపోయిన ధూళి, మట్టి తొలగింపు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, శిథిలాల సేకరణ, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు చేపట్టనున్నారు.

**ఏర్పాట్లు విస్తృతం... అమలే అసలు పరీక్ష**

ప్రతి విభాగానికి ప్రత్యేక చెత్త సేకరణ వాహనాలు, నిర్మాణ శిథిలాల తరలింపుకు ప్రత్యేక ఏర్పాట్లు, ప్రతి 100 మీటర్లకు నీటి డ్రములు, ప్రతి 2 కిలోమీటర్లకు వాటర్ ట్యాంకర్లు, డివైడర్ల శుభ్రతకు ప్రత్యేక బృందాలు సిద్ధం చేశారు. నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ స్వచ్ఛందంగా పాల్గొనాలని అధికారులు పిలుపునిచ్చారు. పాల్గొనే వాలంటీర్లకు మార్గదర్శకత్వం, గుర్తింపు కల్పించనున్నారు.

**ఆక్రమణలతో ఫుట్‌పాత్‌లు మాయం... రోడ్లపై మట్టి గుట్టలు**

ఈ మార్గంలో రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, నిర్మాణ వ్యర్థాలు, రహదారుల అంచుల్లో పేరుకుపోయే మట్టి, చెత్త సమస్యలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. పలు చోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురై నడిచే మార్గాలు సంకుచితమవుతున్నాయి. అనధికార బ్యానర్లు, ఫ్లెక్సీలు సమస్యను మరింత తీవ్రమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల మధ్య చేపట్టిన ఈ ‘క్లీన్ స్వీప్’పై ప్రజల్లో ఆశలు పెరుగుతున్నాయి. ఎంపిక చేసిన ఈ మార్గాన్ని పరిశుభ్రతకు నమూనాగా తీర్చిదిద్దుతూ, సైబరాబాద్ అంతటా శుభ్రత ప్రమాణాలకు కొత్త దిశ ఇవ్వాలన్నదే అధికారుల లక్ష్యం. అయితే ఒకరోజు డ్రైవ్‌తోనే మార్పు కనిపించాలంటే, తర్వాత కూడా అదే స్థాయి నిర్వహణ కొనసాగుతుందా లేదా అన్నదే కీలకం. నగరాన్ని నిజంగా శుభ్రంగా ఉంచే బాధ్యతను అధికారులు ఎంతవరకు నిలబెట్టుకుంటారు? ఇదే ఇప్పుడు ప్రజల ప్రశ్న.

# ప్రజలకు వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- కొలన్ హన్మంత్ రెడ్డి
- ఇంద్రన్న కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభించిన కెహెచ్ఆర్

కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:

ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ విలేజ్, ఇంద్రన్న కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా పాడు కావడంతో తీవ్ర ఇబ్బంది అవుతుందని కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. అధికారులతో మాట్లాడి జిహెచ్ఎంసి మున్సిపల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించారు. గురువారం సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు వారిని శాలువాలతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి, కాలనీ నిర్మాత కుంచెల సైదప్ప, కుంచల రాము, సరళ, లక్ష్మన్న, పి ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, సభావత్ రామచందర్ నాయక్, క్యాంటీన్ నాగరాజు వెంకట్ రెడ్డి, గట్టయ్య, ఆనంద్, మోహన్ రెడ్డి, శ్రీకాంత్ పంతులు, సంపత్ పంతులు, వాసు, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, విష్ణు, రామకృష్ణ, మల్లేష్, రజినీకాంత్, నాని, ప్లంబర్ శీను, మోహన్, శ్రీను, మహేష్, కనకరాజు, వెంకటలక్ష్మి, సత్యవతి, రమణబాబు, రాయుడు, కుంచాల, పాల బిందెల శ్రీనివాస్, శేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# గండిమైసమ్మ, బహదూర్ పల్లిలో అక్రమ నిర్మాణాలు నేలమట్టం

దుండిగల్, సిటీటైమ్స్:

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని దుండిగల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టం చేశారు. దుండిగల్ డిసి వెంకటేష్ నాయక్ ఆదేశాల మేరకు గురువారం ఏసిపి శ్రీనివాస్ నేతృత్వంలో సర్కిల్ పరిధిలోని గండి మైసమ్మ, బహదూర్ పల్లిలలో పలు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గండి మైసమ్మలోని తాజ్ హోటల్ పక్కన భవనంతో పాటు ఓ షెడ్డును, బహదూరు పల్లి లోని కమర్షియల్ షెడ్ కూల్చి వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించి అనుమతులకు విరుద్ధంగా నిబంధనలు పాటించకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.





# లిటిల్ విల్లే ప్రీ స్కూల్‌లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**సీతారాముల వేషధారణలో ఆకర్షించిన చిన్నారులు**

కూకట్ పల్లి, సిటీ టైమ్స్:

కూకట్‌పల్లి ఈనాడు కాలనీలోని లిటిల్ విల్లే ప్రీ స్కూల్ లో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, పండగల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. చిన్నారులు శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుని వేషధారణలతో చూపరులను ఆకర్షించడంతో పాటు ముగ్దులను చేశారు. విద్యార్థులు రామాయణంలోని పలు ఘట్టాలను ప్రదర్శించడంతో పాటు, భక్తి గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేసి సందడి చేశారు. వేడుకల అనంతరం పాఠశాల సిబ్బంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు శ్రీరామనవమి ప్రత్యేక పానకం, వడపప్పు ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ పండుగలు మన జీవనశైలిలో భాగమని, చిన్నతనం నుంచే పిల్లలకు మన పురాణాల గురించి, రాముని ఆదర్శాల గురించి తెలియజేలనే ఉద్దేశంతో ఈ వేడుకలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఐటిసి లిమిటెడ్ వారి సిఎస్ఆర్ విరాళం అభినందనీయం

- పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- ఐడిఎ బొల్లారంకు రూ.32లక్షల విలువగల వాహనాలు, పరికరాలు పంపిణీ

బొల్లారం, సిటీటైమ్స్:

సామాజిక బాధ్యతలో భాగంగా ఐటిసి లిమిటెడ్ కంపెనీ వారు సిఎస్ఆర్ విరాళాలు అందజేయడం అభినందనీయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఐడిఎ బొల్లారం మున్సిపాలిటీకి ఐటిసి లిమిటెడ్ నుండి వచ్చిన సిఎస్ఆర్ విరాళాలు రూ.32 లక్షలతో 8 బ్యాటరీ ఆటోరిక్షాలు, స్థానిక మోడల్ పాఠశాల కోసం 15 కంప్యూటర్లు, దివ్యాంగుల కోసం మోటారుతో నడిచే మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు జి రాంబాబు యాదవ్ , యూనిట్ హెడ్ సుబ్రమణ్యం, హెచ్ ఆర్ హెడ్ శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీ సాంబశివ రావు , వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎస్ రెడ్డి, జెవిఆర్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర ఎంక్లేవ్ కాలనీ గన్ పార్క్ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి



- బిఆర్ఎస్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి

కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:

కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని 287 డివిజన్ సుచిత్ర వద్ద ఉన్న వెంకటేశ్వర ఎంక్లేవ్ కాలనీ గన్ పార్క్ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి అధికారులను కోరారు. గురువారం వారి ఆధ్వర్యంలో కుతుబుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ను కలిసిన బిఆర్ఎస్ నాయకుడు వీరారెడ్డి నరేందర్ రెడ్డి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలో పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

# రెండు రోజుల బిఎల్ఓల శిక్షణ కార్యక్రమం విజయవంతం

బాచుపల్లి, సిటీటైమ్స్:

బాచుపల్లి మండల పరిధిలో భారత ఎన్నికల సంఘం డీఈఓ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మార్గదర్శకాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆ) -2026 కు సంబంధించి బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఓ) శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారని తహశీల్దార్ టి వాణి రెడ్డి పేర్కొన్నారు. గురు, శుక్రవారం రెండు రోజులలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్వో) బాచుపల్లి తహశీల్దార్ వాణిరెడ్డి ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్లు టి రవీందర్ ,జ్యోతిలు నిర్వహించారు. శిక్షణలో ఓటర్ల నమోదు, ఫారంల స్వీకరణ, ఫీల్డ్ వెరిఫికేషన్, డేటా అప్డేషన్, ఎస్ఐఆర్ 2026 ఇది ఓటరు జాబితాను పూర్తిగా పరిశీలించి సవరణ చేసే ప్రత్యేక ప్రక్రియతో ముఖ్యమైన అంశాలపై విపులంగా అవగాహన కల్పించారని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు ప్రాక్టికల్ డెమోస్ ద్వారా బిఎల్ఓలకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. అలాగే బిఎల్ఓలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు అవసరమైన సూచనలు కూడా చేశారని, ఈ సందర్భంగా బిఎల్ఓలు ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు.,





# చమురు సంక్షోభం తాత్కాలికమే!

ప్రపంచ దేశాలు అసూయపడేలా, 2025లో భారతదేశ జీడీపీ వృద్ధిరేటు 7.4శాతాన్ని చేరుకుంది. ఇండియా ఆర్థిక వ్యవస్థ చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. భారత్‌కు అవసరమైన చమురులో 40శాతం కంటే ఎక్కువ హర్మూజ్ జలసంధి గుండానే వస్తుంది. బీమా ఖర్చులు పెరగడం, యుద్ధ భయం, ఇతర కారణాల వల్ల ప్రస్తుతం ఆ మార్గంలో నౌకలు చాలా తక్కువగా ప్రయాణిస్తున్నాయి. పశ్చిమాసియాలో భారీ ఉత్పత్తిదారులైన కువైట్, ఖతార్ వంటి దేశాలు తమ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఈ పరిస్థితికి ప్రతిస్పందిస్తున్నాయి. డిసెంబరులో బ్యారెల్‌కు 61డాలర్లుగా ఉన్న బ్రెంట్ క్రూడ్ ధర... మార్చి 8 నాటికి దాదాపు 120డాలర్లకు చేరి, ఆ మరుసటి రోజు 91 డాలర్ల దగ్గర స్థిరపడింది. అంటే, ఇది 49శాతం పెరుగుదలను చవిచూసిందన్న మాట. రష్యా చమురు 72 డాలర్లకే లభిస్తున్నప్పటికీ, అది కూడా 46శాతం మేర పెరిగింది. అమెరికా అధిక సుంకాల హెచ్చరికలు మార్కెట్లో భయాన్ని పెంచుతున్నాయి.

అత్యంత దారుణ పరిస్థితుల్లోనే...

మురు ధరలు చరిత్రలో ఎన్నడూ లేనంతగా, దీర్ఘకాలం పాటు పెరిగితే, చాలా రంగాలు దెబ్బతినిపోయే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా భారీ ఔషధ పరిశ్రమలు అధికంగా ఇంధనంపై ఆధారపడి పనిచేస్తాయి. హైదరాబాద్‌లోని దివిస్ లాబొరేటరీస్, డాక్టర్ రెడ్డీస్ వంటి సంస్థలు ప్రొడక్షన్ లైన్లను శుద్ధి చేయడానికి ఖరీదైన వెంటిలేషన్ యూనిట్‌లను రన్ చేస్తాయి. రవాణా, విద్యుత్ వంటి రంగాలకూ ఇంధనం అత్యవసరమే. యుద్ధం వల్ల చమురు తగినంతగా లభ్యం కాకపోతే పరిస్థితి ఏమిటన్న చర్చ జరుగుతోంది. అయితే, మాంద్యం గురించి భయపడటానికి ముందు కొన్ని విషయాలను మనం గమనించాలి. చమురు ఉత్పత్తి అయ్యే ప్రాంతాల్లో అనేక యుద్ధాలు జరిగిన చరిత్ర ఉంది. ఇది చాలా కొద్దిమందికి మాత్రమే తెలిసిన ఒక ఆశ్చర్యకర సత్యాన్ని వెల్లడిస్తుంది. 1980 తరవాత అత్యంత కీలకమైన చమురు ఉత్పత్తి ప్రాంతాల్లో తొమ్మిది ప్రధాన ఘర్షణలు జరిగాయి. ఆ యుద్ధాలు మొదలైన నెల రోజుల్లో ధరలు సగటున 5.5శాతం పెరిగాయి. అదే ఆరు నెలల తరవాత చూస్తే- చమురు ధరలు యుద్ధం ముందునాటి కంటే మైనస్ 3.9శాతం తక్కువగా నమోదయ్యాయి. ఏడాది తరవాత కూడా మైనస్ 5.3శాతం దగ్గరే ఆ ధరలు నిలిచిపోయాయి. అంటే, యుద్ధం ఆరంభమైన మొదట్లో ఇంధన ధరలు తాత్కాలికంగా పెరిగినా, ఆ తరవాత తగ్గిపోతాయన్న మాట!

గత రెండు యుద్ధాలను గమనిస్తే- 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తరవాత నెల రోజుల్లో చమురు ధరలు ఏకంగా 21.1శాతం మేర పెరిగాయి. కానీ, ఆరు నెలల తరవాత ఆ పెరుగుదల అదృశ్యమైపోయింది! ఏడాది తరవాత చమురు ధరలు 18.7 శాతం మేరా తగ్గిపోయాయి. 2023లో హమాస్ ఇజ్రాయెల్‌పై దాడిచేసిన ఏడాది తరవాత కూడా చమురు ధరలు ఇలాగే ఏడు శాతం దాకా దిగివచ్చాయి. 2003లో ఇరాక్‌పై దాడి సమయంలో మాత్రమే ధరలు పెరిగాయి. చమురు సరఫరా తక్కువగా ఉండటం, చైనా నుంచి డిమాండ్ పెరగడం వల్లే అప్పుడు అలా జరిగింది. అయినప్పటికీ, భారత్ ఇంధన వృద్ధిని సాధించింది. అసలు యుద్ధం తరవాత చమురు ధరలు ఎందుకు తగ్గుతున్నట్లు? చమురు మార్కెట్ ముందుగానే అనేకానేక భయాలు, ఊహాగానాలను ధరల్లో ప్రతిబింబిస్తుంది. యుద్ధం తాలూకా వాస్తవ ప్రభావం బయటపడేలోపే మార్కెట్ ప్రతిస్పందించేస్తుంది. అమెరికా నౌకాదళాల కదలికల వల్ల యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయనే ఆందోళన కారణంగా ఈసారి ధరలు పెరిగాయి. మొదట్లో ఇరాన్ ఎదురుదాడి చేస్తుందనే భయం, ఆ తరవాత హర్మూజ్ జలసంధి మూతపడటం వంటివి సైతం ధరల పెరుగుదలకు దారితీశాయి.

చమురు ధరలు పెరుగుతూనే ఉండటమనేది హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేసి, యుద్ధం దీర్ఘకాలంపాటు జరగడం వంటి 'అత్యంత దారుణ పరిస్థితుల'పై ఆధారపడి ఉంటుంది. కానీ వాస్తవంలో అలా జరగకపోవచ్చు! క్యాపిటల్ మార్కెట్లు త్వరలోనే ఇలాంటి భయాందోళనలను పటాపంచలు చేస్తాయి. ప్రభుత్వాలూ, కంపెనీలూ పరిస్థితులకు తగ్గట్లు మార్పులు చేసుకుంటాయి. సౌదీ అరేబియా ఇప్పుడు హర్మూజ్ జలసంధికి ఆవల ఉన్న యాన్‌బు పోర్టుకు రోజూ అయిదు మిలియన్ బ్యారెళ్ల చమురును పంపుతోంది.

అనవసర భయాలు వద్దు...

భారత్ 30రోజుల పాటు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేలా ఆంక్షల నుంచి అమెరికా తాజాగా మినహాయింపు ఇచ్చింది. వెనెజువెలా చమురు సైతం ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్యం కిందకు వస్తోంది. ప్రస్తుతం ఇండియా దగ్గర 50-74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నట్లు అంచనా. అయితే ఇది ఎలాంటి దిగుమతులు లేనప్పటి పరిస్థితి. ప్రస్తుతం భారత్‌లోని 60శాతం సరఫరా కొనసాగుతుండటంతో ఈ నిల్వలు సుమారు 125-185 రోజుల వరకు సరిపోవచ్చు. ఇరాన్ హర్మూజ్ జలసంధిని నెలల తరబడి మూసివేసినా (1980ల నాటి ఇరాక్-ఇరాన్ యుద్ధ సమయంలోనూ అది పూర్తిగా సాధ్యపడలేదు), దాని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. ఇండియా తీవ్రమైన చమురు కొరతను ఎదుర్కొనే పరిస్థితులేవీ ప్రస్తుతం కనిపించడం లేదు. కాబట్టి, దేశంలో ధరలు పెరిగిపోతాయన్న భయంతో చమురు కొనిపెట్టుకోవడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరమేమీ లేదు. చమురు విషయంలో అనవసరంగా భయపడకుండా, త్వరలోనే అంతర్జాతీయంగా వాటి ధరలు దిగివస్తాయని అందరూ అర్థం చేసుకోవాలి.



# ప్రాణాంతక ఆయుధపోటీలో ప్రపంచం!

ప్రజల బాగోగులకు తగినంత సొమ్ము వెచ్చించని రాజ్యాలు ఆర్థిక అసమానతలకు ఆలవాలమై కుప్పకూలిపోతాయి. గతం నేర్పుతున్న ఈ గుణపాఠాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాల్సిన దేశాలేమో ఆయుధ సంపత్తి సమీకరణకు ప్రాధాన్యమిస్తూ జనజీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. 'సామాజిక అభ్యున్నతి కార్యక్రమాలకంటే సైనిక రక్షణ కోసం ఏటేటా ఎక్కువ డబ్బును ఖర్చు చేసే దేశం నైతికంగా మరణానికి చేరువవుతుంది' అన్న మార్టిన్ లూథర్ కింగ్ స్వదేశం అమెరికాయే మారణాయుధాల కోసం జనసంక్షేమాన్ని ఎక్కువగా బలిస్తోంది. ప్రస్తుతం 90వేలకోట్ల డాలర్లుగా ఉన్న తమ రక్షణ బడ్జెట్‌ను వచ్చే ఏడాదిలో లక్షన్నర కోట్ల డాలర్లకు పెంచాల్సి ఉంటుందని అగ్రరాజ్యాధిపతి ఇటీవల సెలవిచ్చారు. అమెరికాను పక్కకునెట్టి ప్రపంచంపై పెత్తనం చేయాలనుకుంటున్న చైనా తాజాగా తన సాయుధ బలగాలకు నిరుటికంటే ఏడుశాతం అధికంగా 27800కోట్ల డాలర్లను కేటాయించింది. పాకిస్థాన్, చైనాల నుంచి నిరంతర ముప్పును



ఎదుర్కొంటున్న ఇండియా అనివార్యంగా ఈసారి రక్షణకు 15శాతం ఎక్కువ నిధులను ప్రత్యేకించింది. యుద్ధాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాటితో ముమ్మరిస్తున్న ఆయుధ పోటీ కారణంగా వందకు పైగా దేశాలు తమ మిలిటరీ వ్యయాలను లోగడకంటే పెంచేశాయి. దాంతో 1988లో 1.74లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న ప్రపంచ సైనిక ఖర్చులు 2024లో 2.71లక్షల కోట్ల డాలర్లకు చేరాయి. 2025లో అవి మరో 2.5శాతం ఎక్కువైనట్లు అంచనా. విద్య, వైద్యం, గృహనిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలకు నిధులు తెగ్గోసేస్తూ, పన్నుల మోత మోగిస్తూ, అప్పులు చేస్తూ ప్రభుత్వాలు పోగేస్తున్న డబ్బు అంతిమంగా ఆయుధ కంపెనీల పరమవుతూ, నడుస్తున్న చరిత్రకు నెత్తుటి మరకలద్దుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, సామాజిక, పర్యావరణ సంక్షోభాలను ఎగదోస్తోంది!

విశ్వవ్యాప్తంగా 67కోట్లమంది అభాగ్యులు తీవ్రస్థాయి ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. కనీసం 230కోట్లమంది నిత్యం ఆహార అభద్రతతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఏడాదికి 9300కోట్ల డాలర్ల చొప్పున 2030 వరకు ఖర్చు పెట్టగలిగితే క్షుద్బాధ నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించవచ్చునని ఐరాస పేర్కొంటోంది. 2024 విశ్వ మిలిటరీ వ్యయంలో కేవలం నాలుగు శాతం సొమ్ముతోనే ఇది సాధ్యపడుతుంది. అదే 14శాతం వెచ్చిస్తే అల్ప, దిగువ మధ్యాదాయ దేశాల్లోని ప్రజలందరికీ ప్రాథమిక వైద్య వసతులు సమకూర్చవచ్చు. 11400కోట్ల డాలర్ల పెట్టుబడి పెడితే చాలు 140 దేశాల ప్రజానీకానికి సురక్షిత మంచి నీటిని అందించవచ్చు. ప్రపంచమంతా అందరూ కలిసి యుద్ధక్షేత్రాల్లో గుమ్మరిస్తున్న మొత్తంలో 15శాతం సొమ్మును పక్కనపెడితే పర్యావరణ మార్పుల విషకౌగిలి నుంచి వర్ధమాన రాజ్యాలు బయటపడగలుగుతాయి. ఇలాంటి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కాసులు విదిలించని దేశాలు అపనమ్మకాలూ అత్యాశలతో అంతర్జాతీయ వేదికలను బలహీన పరుస్తూ, ప్రపంచాన్ని కత్తులబోనుగా మార్చేస్తున్నాయి!

ప్రాణాంతక ఆయుధాల తయారీకి దేశాలు డబ్బు ధారపోస్తున్నకొద్దీ వసుధ నలుచెరగులా హింస ప్రబలుతోంది. దానివల్ల ప్రపంచం ఏడాదికి 17.5లక్షల కోట్ల డాలర్ల సంపదను కోల్పోతోందని 2022లో వెల్లడైంది. రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా యుద్ధాలను కూడా కలిపి లెక్కేస్తే ఇప్పుడు ఆ నష్టం ఇంకా ఎక్కువగా ఉంటుందన్నది వాస్తవం. సర్వసత్తాక సార్వభౌమాధికార రాజ్యాల సమాహారమే ప్రపంచం. అన్ని దేశాలూ పరస్పర సార్వభౌమత్వాన్ని గౌరవించుకుంటూ సహకార భావనతో ముందుకెళ్తే విశ్వమానవ సౌభాగ్యాన్ని హరిస్తున్న మిలిటరీ వ్యయాలు అవే దిగివస్తాయి. యుద్ధోన్మాదంతో ఊగిపోతున్న దేశాల్లో ఆ విజ్ఞత ఎప్పటికి ఉదయిస్తుందన్నదే బేతాళప్రశ్న!

# కత్తిదించు ట్రంప్.. ఎత్తు శాంతి పతాక!

ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్‌లు నిర్హేతుకంగా ప్రారంభించిన యుద్ధం బాధిత దేశాన్ని ధ్వంసం చేస్తోంది. పశ్చిమాసియా అంతటా అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఆ యుద్ధ ప్రభావాలు ఇరాన్‌కు, పశ్చిమాసియాకు మాత్రమే పరిమితం కావడం లేదు. దాని పర్యవసానాలు సమస్త దేశాలనూ సమస్యల సుడిలోకి నెట్టివేస్తున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన అమెరికా–ఇజ్రాయెల్ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో ఇరాన్‌లో అపార ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించింది. అయితే ఆ దేశం ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు, శత్రువుకు లొంగలేదు. యుద్ధ విషమ పరీక్షలో ఇరాన్ ఓడిపోలేదు. అయతొల్లా ఖమేనీతో సహా దేశ అగ్ర నాయకులు అందరూ యుద్ధం మొదటి రోజునే హతమయ్యారు. కొంత పెనుగులాటతోనే ఇరాన్ కొత్త అధినేతను ఎన్నుకున్నది.. సైనిక శ్రేణులకు కొత్త నాయకులను నియమించింది. కొత్త అధినేతను, సైనికాధికారులనూ తుదముట్టిస్తామని అమెరికా– ఇజ్రాయెల్ ప్రకటించాయి. టెహ్రాన్, సనాందాజ్, ఇస్ఫహాన్ తదితర ప్రధాన నగరాలపై బాంబుల వర్షం కురిపించాయి. ఇంతవరకు దాదాపు 1300మంది ఇరానియన్లు హతమయ్యారు, పదివేల మంది గాయపడ్డారు. అమెరికన్ క్షిపణి ఒకటి ఒక పాఠశాలను భస్మీపటలం చేసింది. ఈ భయానక ఘటనలో 168 మంది బాలలు, 14 మంది ఉపాధ్యాయులు మాడి మసైపోయారు. ఆ చిన్నారులు చేసిన నేరమేమిటి? వారి గురువులు పాల్పడిన పాపమేమిటి?



ఇరాన్‌లో సంభవించిన విధ్వంసాన్ని రేఖామాత్రంగా పేర్కొంటాను: క్షిపణి ప్రయోగ వేదికలు, సైనిక దళాల స్థావరాలు, నౌకాదళ ఆస్తులు, వాయుతల రక్షణ కేంద్రాలు, ఉత్పత్తి సదుపాయాలు; గృహాలు, పాఠశాలలు, ఆస్పత్రులు; చమురు నిల్వ కేంద్రాలు (ఇవి ఇంకా భగభగ మండుతూనే ఉన్నాయి); నీటి సరఫరా కేంద్రాలు మొదలైన ప్రాథమిక పౌర సదుపాయాలు; ముప్పులో పడిన ప్రజారోగ్యం; కనీవినీ ఎరుగనిరీతిలో పర్యావరణ విధ్వంసం. ఇరాన్‌లో పాలనా వ్యవస్థ స్వభావాన్ని పక్కన పెట్టి ఇరానియన్ల యోగక్షేమాలపై మన దృష్టిని కేంద్రీకరిద్దాం. ఇంత భయంకర విధ్వంసానికి లోను చేసేందుకు వారు చేసిందేమిటి? ఇజ్రాయెల్ ప్రోత్సాహంతో యుద్ధానికి దిగిన అమెరికా.. ఇరాన్‌పై చేసిన ఆరోపణల్లో నిజమెంత? ఇరాన్ పెద్ద ఎత్తున శుద్ధిచేసిన యురేనియంను నిల్వచేసుకుందని, అణ్వస్త్రాల అభివృద్ధిని దాదాపుగా పూర్తి చేసిందని అమెరికా ఆక్రోశించింది. ఖతార్ మధ్యవర్తిత్వంలో ఇరాన్‌తో చర్చలకు అమెరికా పూనుకున్నది. అయినా యుద్ధం ప్రారంభమయ్యే సూచనలను పసిగట్టిన ఒమన్ విదేశాంగమంత్రి వాషింగ్టన్‌కు వాయువేగాన వెళ్లి 'శుద్ధి చేసిన యురేనియంను నిల్వ చేసుకోకుండా ఉండేందుకు' ఇరాన్ అంగీకరించిందని, అలాగే ఎట్టి పరిస్థితులలోనూ 'అణ్వస్త్రాల తయారీకి పూనుకోబోమని' కూడా ఇరాన్ హామీ ఇచ్చిందని సవివరంగా నివేదించారు. అయినా ఒమన్ మాటను ట్రంప్ ఖాతరు చేయలేదు. ఇరాన్ హామీలను తోసిపుచ్చారు.. ఖతార్ మధ్యవర్తిత్వంలో జరుగుతున్న చర్చలను నిలిపివేసి, ఇరాన్‌పై యుద్ధదాడులకు ఆదేశించారు.

ఇజ్రాయెల్ విస్తరణవాదానికి ఇరాన్ ఒక పెద్ద అవరోధం కావచ్చు కానీ, అమెరికాకు ఇరాన్ ఏ విధంగానూ ముప్పు కాదు. 2025 జూన్‌లో ఇరాన్‌కు వ్యతిరేకంగా 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరిట అమెరికా న్యాయ విరుద్ధమైన దాడులు నిర్వహించింది. ఆ దాడుల అనంతరం 'ఇరాన్‌లో యురేనియం శుద్ధి సదుపాయాలను పూర్తిగా నిర్మూలించినట్టు' అమెరికా ప్రకటించింది. మరి మిడ్‌నైట్ హ్యామర్‌లో ఆ విధంగా నష్టపోయిన తరువాత కూడా ఇరాన్ ఎలా అణ్వస్త్రాలను అభివృద్ధి చేసుకున్నది? అవి ఎక్కడ ఉన్నాయి? వాటి విషయమై ఐక్యరాజ్యసమితికి ఒక నివేదిక సమర్పించాలని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థకు అమెరికా విజ్ఞప్తి చేసిందా? అలా విజ్ఞప్తి చేయడం అమెరికా నైతిక బాధ్యత కాదా? అయినా.. ఏ దేశం అణ్వస్త్రాలను కలిగి ఉండాలి, ఏ దేశం ఆ మారణాయుధాలను కలిగి ఉండకూడదని నిర్ణయించే, నిర్దేశించే అధికారం అమెరికాకు ఎక్కడుంది? భారత్, పాకిస్థాన్, ఉత్తర కొరియాలలో కూడా జోక్యం చేసుకుని ఆయా దేశాల అణ్వస్త్రాల తయారీ సామర్థ్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు కూడా అమెరికా నిర్ణయం తీసుకుంటుందా?

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు శత్రువులు ఉన్నారు. పాలస్తీనియన్ల భూ భాగాలలో 1948లో ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేసినప్పుడే ఆ శత్రుత్వం ప్రజ్వరిల్లింది. అయినప్పటికీ కాలక్రమంలో ఇస్లామిక్ దేశాలతో సహా సమస్త ప్రపంచమూ ఇజ్రాయెల్ ఉనికిని గుర్తించింది. పాలస్తీనా విభజన ప్రణాళిక (1947)కు వ్యతిరేకంగా భారత్ ఓటు వేసినప్పటికీ 1950 సెప్టెంబర్‌లో ఇజ్రాయెల్‌ను అధికారికంగా గుర్తించింది. 1992లో ఆ దేశంతో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను నెలకొల్పుకున్నది. వాణిజ్యం, సైనిక సహకారం, గూఢచర్య సమాచారం పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం తదితర విషయాలలో ఉభయ దేశాల మధ్య సంబంధాలు సుస్థిరంగా వర్ధిల్లుతున్నాయి. పశ్చిమాసియా వివాదాలు, సంఘర్షణల్లో భారత్ ఇప్పటివరకు సంయమన వైఖరితో వ్యవహరిస్తూ వస్తోంది. అయితే ఇటీవల భారత్ ఇజ్రాయెల్ పక్షపాతిగా వ్యవహరిస్తోంది. ఈ ఏడాది మార్చి 12న ఇరాన్‌ను మాత్రమే ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రతిపాదించిన తీర్మానానికి భారత్ మద్దతునిచ్చింది. షియా దేశాల కూటమికి, ప్రభవిస్తోన్న సున్నీ దేశాల కూటమికి వ్యతిరేకంగా భారత్, గ్రీస్, సైప్రస్, అరబ్, ఆఫ్రికన్, మధ్యధర సముద్ర తీరస్థ దేశాలు ఒక కూటమిగా ఏర్పడాలని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి ప్రతిపాదించినప్పుడు దానిపై భారత్ మాటమాత్రంగానైనా నిరసన తెలుపలేదు!

ఇరాన్‌పై యుద్ధానికి పోవడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లక్ష్యాలు ఏమిటి? తొలుత 'ఇరాన్‌ను అణ్వస్త్ర రహితం చేయడం' అని ప్రకటించారు. ఆ తరువాత 'ఇరాన్ సైనిక సామర్థ్యాల సంపూర్ణ నిర్మూలన' అని నిర్దేశించుకున్నారు. పిదప, పాలనా వ్యవస్థ మార్పుగా ప్రకటించారు. ఇప్పుడు ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని ట్రంప్ గర్జిస్తున్నారు. 'మీ ప్రభుత్వాన్ని కూలదోయండి, దేశ పాలనను మీ చేతుల్లోకి తీసుకోండి, మీకు ఇదొక అవకాశం' అని ట్రంప్ చేసిన విజ్ఞప్తిని ఇరానియన్లు ఏ మాత్రం పట్టించుకోనేలేదు. ట్రంప్ దుస్సాహసం ఫలితంగా చమురు ధరలు మిన్నంటాయి. బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు పైగా పెరిగింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతోంది. అంతేనా? ట్రంప్ పాలన పట్ల అసంతృప్తి తీవ్రమవుతోంది. ఇరాన్ నియంత్రణలో ఉన్న హోర్మూజ్ జలసంధి ద్వారా ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు నిలిచిపోయాయి. మన దేశంలో ఎల్‌పీజీ సిలిండర్ల కొరత ఏర్పడింది. ధరలు పెరిగిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. యుద్ధ వ్యయాలు రోజుకు 200 కోట్ల డాలర్లు అని నిపుణులు అంచనా వేశారు. ఇరానియన్లు, ప్రపంచ ప్రజలు చెల్లిస్తున్న మూల్యం అగణితమైనది కాదూ?

'యుద్ధం క్రూరమైనది, నిరర్థకమైనది, మూర్ఖమైనది' అని జనరల్ ఐసెన్ హోవర్ (రెండో ప్రపంచ యుద్ధంలో మిత్ర రాజ్యాల సేనలకు నేతృత్వం వహించిన సైనికాధికారి, 1950వ దశకంలో అమెరికా అధ్యక్షుడు) అన్నారు. ఆయన అనుభవపూర్వకంగా చెప్పిన సత్యమది. నాలుగు సంవత్సరాల క్రితం పొరుగు దేశం ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించింది. అంతిమ విజయం రష్యాకు ఇంకా యోజనాల దూరంలో ఉన్నది. ఒక పక్క గెలుపు అసాధ్యంగా ఉండగా మరో పక్క రష్యా రుణ భారం పెరిగిపోయింది. చమురు ఎగుమతుల ఆదాయం తగ్గిపోతోంది. ఒకనాడు హిట్లర్ సేనను మట్టి కరిపించిన రష్యా సైన్యం ఇప్పుడు కిరాయి సైనికులను ఉపయోగించుకుంటోంది! ఇరాన్‌పై నిష్కారణంగా ఎత్తిన కత్తిని దించివేసే యోచన అమెరికాకు ఉన్నట్టు కనిపించడం లేదు. పశ్చిమాసియాలో యుద్ధం పిచ్చికుక్కలా పరుగెడుతూనే ఉంటుంది, సందేహం లేదు. ఇరాన్‌కు వ్యతిరేకంగా చేస్తోన్న ఈ యుద్ధాన్ని నవ నవీన యంత్రాలతో పోరాడుతున్నందున అవి నిరాటంకంగా సరఫరా అవుతున్నంత వరకు అమెరికా ఈ యుద్ధాన్ని విరమించదు. విజయం అనే మృగతృష్ణకు చేరేదాకా కొనసాగిస్తుంది!

యుద్ధాన్ని ప్రారంభించే దేశానికి ఆ యుద్ధాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా నిలిపివేయాలో కూడా బాగా తెలిసి ఉండాలి. అటువంటి అవగాహనతోనే యుద్ధానికి దిగాలి. యుద్ధం తాకిడి ప్రతి దేశానికి తప్పక ఉంటుంది. ప్రతి ఒక్కరూ దాని దుష్ప్రభావ పరిధిలోనే ఉంటారు. ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించినప్పుడు భారత్ ఆ దురాగతాన్ని ఖండించలేదు. సరికదా, 'ఇది యుద్ధాల యుగం కాదు' అని వ్యాఖ్యానించింది! వెనెజువెలా అధినేత నికోలస్ మదురోను అమెరికా కిడ్నాప్ చేసి తీసుకెళ్లినప్పుడు ఆ దుశ్చర్యను భారత్ ఖండించలేదు. రష్యాకు చేసినట్లుగా అమెరికాకు ఎటువంటి ధర్మోపదేశాలు చేయలేదు. పశ్చిమాసియాలో ప్రస్తుత నిర్హేతుక యుద్ధాన్ని ఖండిస్తూ మన దేశం బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అమెరికా/ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధంలో జాతిపరమైన, మతపరమైన వైషమ్యాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ ఒక సామ్రాజ్యవాద దేశంగా ప్రవర్తిస్తోంది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్ పైకి యుద్ధానికి వెళ్లడం ద్వారా అమెరికా తన సంస్థాపక సూత్రాలకు సమాధి కడుతోంది! జాతి పితామహుల ఆదర్శాలను అలక్ష్యం చేసే దేశం నైతికంగా వ్యవహరిస్తుందా? అయ్యో, మన భారత్ అయినా న్యాయ నిష్ఠ చూపడం లేదే?! బలవంతుడి మాటే వేదవాక్కు అని విశ్వసించేవారి ఎదుట వణుకుతూ, విధేయ వైఖరితో వ్యవహరించడమేమిటి? భారత్ స్వీయలక్ష్యాలే మననీ బలహీన స్థితికి తగ్గించివేశాయి!




# ఆడపిల్లకు న్యాయం..అడిగితే అక్రమ కేసులా?

- ప్రశ్నించే గొంతుకులపై ఎం.ఎల్.ఏ భారీ కుట్ర...
- అక్రమ అరెస్టులకు నిరసనగా వేలాదిమంది పోలీసు స్టేషన్ ముట్టడి...
- బేషరతుగా నాయకులను విడుదల చేయాలని డిమాండ్...
- పోలీసుల తీరుపై సర్వత్రా నిరసన.
- రాజకీయ, విద్యార్థి, మహిళా, ప్రజా సంఘాల మద్దతు...

వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ మార్చి 26

సోమవారం రోజు అక్షర స్కూల్ లో మైనారిటీ బాలికపై జరిగిన అత్యాచారాన్ని ప్రశ్నించడానికి వెళ్ళిన నాయకులు నందిమల్ల.అశోక్, చీర్ల.చందర్,మెకానిక్.శ్రీను మరో 6మందిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ముందు మెరుపు ధర్నా నిర్వహించారు.బి.ఆర్.ఎస్ నాయకులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పలుస రమేష్ గౌడ్ ఆధ్వర్యములో అక్రమంగా అరెస్టు చేసిన నాయకుల్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆడపిల్లపై అత్యాచారం చేసిన నిందితున్ని యాజమాన్యాన్ని కాపాడాలని ఎం.ఎల్.ఏ చేసిన భారీ కుట్రలో బాగంగా నాయకులను అరెస్ట్ చేశారని వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వపరంగా బాధిత బాలికకు,కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షములో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంచేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో



బిజెపి నాయకులు రాజశేఖర్ గౌడ్, పెద్దిరాజు, కాగితాల లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్ మున్సిపల్ కౌన్సిలర్సు మురళి సాగర్ శ్రీకర్ గౌడ్ చింటూ సమద్ స్టార్ రహీం, హేమంత్ ముదిరాజ్, జోహార్ హుస్సేన్, సూర్యవంశం గిరి, యుగంధర్ రెడ్డి, చిట్యాల రాము,సి.పి.ఎం నాయకులు పరమేశ్వరా చారి , సి.పి. ఐ నాయకులు గోపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# ఐఎన్ టియుసి ఆధ్వర్యంలో సింగరేణి జిఎంకు వినతి పత్రం

- సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించండి
- కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్

కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,

ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి సింగరేణి జిఎం శాలెం రాజును కలిసి సింగరేణి ఏరియాలో ఉన్న పలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాలో సర్ ఫేస్ లొ ఉన్న ఖాళీలను ముందుగా అండర్ గ్రౌండ్ లో పనిచేసే జనరల్ అసిస్టెంట్లకు ప్రాధాన్యత ఇచ్చి తద్వారా సర్ఫేస్ లో ఉన్న జనరల్ అసిస్టెంట్ల తో భర్తీ చేయాలి,కొత్తగూడెం ఏరియా లోని మైన్స్, డిపార్ట్మెంట్స్, ఓ.సి.పి లలో అవసరమైన మ్యాన్ పవర్ ను, టెక్నీషియన్స్, ఫిటర్స్, ఎలక్ట్రిషన్స్, క్లర్క్స్ స్టాఫ్ ను, సూపర్ వైజర్ స్టాఫ్ ను ఇతర డెసిగ్నేషన్లను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్రాంచ్ కార్యదర్శిలు పోశం శ్రీనివాస్, విప్లవ కుమార్, మెంగాని అశోక్, ట్రెజరర్ భీముడు, ఫిట్ కార్యదర్శిలు చిలక రాజయ్య, ఎండి సత్తార్ పాషా, ఈ మోహన్ రెడ్డి, డి శంకర్ బాబు,కే. నటరాజ్, సిహెచ్ సాగర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాలను అనుసంధానం చేస్తూ ప్రతి మండల కేంద్రానికి ఆర్టీసి బస్సుల సౌకర్యం

- రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి సిటీ టైమ్స్ మార్చ్ 26



వనపర్తి నియోజకవర్గంలోనీ ప్రతి గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించేందుకు వనపర్తి ఆర్టిసి డిపోకు కొత్తగా 20 RTC బస్సులు కావాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కోరారు గురువారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన అసెంబ్లీ హాల్ 1 లో నిర్వహించినా ప్రత్యేక సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు ఆర్టీసీ యాజమాన్యం, అధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.... వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో బస్టాండ్ వైపు రోడ్డులో డిపో గోడలకు అనుసంధానంగా ఉన్న చిరు వ్యాపార సముదాయాలను, వెనకాలకు జరిపి కట్టుకునే విధంగా చేసి రోడ్డు వెడల్పుకు ఆర్టీసీ డిపో యాజమాన్యం సహకరించాలని ఎమ్మెల్యే కోరారు వనపర్తి జిల్లా కేంద్రంలో 20 ఎకరాలలో కొత్త బస్ డిపో నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు ప్రస్తుతం ఉన్న పాత డిపో స్థలంలో పట్టణ అభివృద్ధిని కాంక్షిస్తూ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు వనపర్తి డిపోకు కొత్తగా 20 బస్సులను మంజూరు చేయాలని మంత్రి గారిని కోరారు వనపర్తి పట్టణంలో రెండు మినీ బస్సులను (సిటీ బస్సు మాదిరిగా) ఏర్పాటు చేయాలని దీంతో వనపర్తి లోని విద్యార్థులకు వ్యాపారస్తులకు ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు వనపర్తి నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నుంచి ఆయా మండల కేంద్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వయా యాపర్ల గుమ్మడం, గుమ్మడం తండా, చిన్న గుమ్మడం కలుపుతూ ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే వనపర్తి నుంచి వయా మానాజిపేట్ మహబూబ్నగర్కు నాలుగు ట్రిప్పులు అదనంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు వనపర్తి పెద్దమందడి మండల కేంద్రానికి షటిల్ బస్ ఏర్పాటు చేసి రోజు పది ట్రిప్పులు తిరిగేలా చూడాలన్నారు వనపర్తి జిల్లా రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్యాలయానికి (RTO)నూతన భవన నిర్మాణం కోసం అప్పయ్యపల్లి దగ్గర కేటాయించిన స్థలంలో వెంటనే కార్యాలయ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకోరారు అదేవిధంగా వనపర్తి, పెబ్బేరు పట్టణాల్లోని ఆర్టీసీ బస్టాండ్లలో నిర్మించనున్న CC బెడ్ లకు సంబంధించి వనపర్తి బస్టాండ్ కు 2.50 కోట్లు మంజూరు అయి ఉన్నాయని, అదేవిధంగా పెబ్బేరు బస్టాండ్ లోని cc బెడ్ నిర్మాణా నికి రూ. 1. 20 కోట్ల రూపాయలు మంజూరై ఉన్నాయని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు



ఇందిరమ్మ ఇళ్లతో

# పేదల కలలు సాకారం

- టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు

కొత్తగూడెం , సిటీ టైమ్స్ ,

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్ మండలం రాఘవాపురంలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు హాజరై గృహప్రవేశాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు చిమట అనిత సూరయ్య దంపతులు తమ సొంత ఇంటిలోకి అడుగుపెట్టడంతో వారికి నూతన వస్త్రాలు బహూకరించి శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా నాగా సీతారాములు సొంతింటి కల నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగపడుతుందని, రానున్న రోజుల్లో మరింత మంది పేద కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని, ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గరిక సాంబయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు గరిక జయరాజ్ ,తెల్లబోయిన పెద్ద శ్రీను,చిమట చిన్న వెంకటేశ్వర్లు,తెల్లబోయిన కోటి ,నరేష్,వెంకటేశ్వర్లు,గ్రామ పెద్దలు , వారి బంధువులు పాల్గొన్నారు.

# సీతారాముల కళ్యాణానికి ముస్తాబైన బుద్దారం గండి ఆంజనేయ స్వామి టెంపుల్

వనపర్తి సిటీ టైమ్స్ మార్చ్ 26

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గోపాలపేట మండలం బుద్దారం గ్రామంలోని గండి అభయాంజనేయ స్వామి వారి సన్నిధిలో సీతారాముల కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి..నేడు శ్రీరామనవమి సందర్భంగా దేవాలయంలో ఉదయం 06 గంటలకు సీతా రామచంద్ర స్వామి వారికి అభిషేకం, 11 గంటలకు స్వామి వారికి పట్టువస్త్రాలతో సమర్పణ,12:05 నిమిషాలకు సీతారాముల వారి కళ్యాణ మహోత్సవంతో పాటు 1 గంటలకు అన్నదానం కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని కార్యనిర్వహాణ అధికారి రామేశ్వర శర్మ మరియు జూనియర్ అసిస్టెంట్ నాగేష్ తెలిపారు... ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.




జీఎస్టీ సవరణ బిల్లుకు

# అసెంబ్లీ ఆమోదం

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణ శాసనసభలో వస్తు సేవల పన్ను చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లుపై విస్తృత చర్చ జరిగిన అనంతరం, సభ ఏకగ్రీవంగా దీనిని ఆమోదించింది. ప్రధానంగా పన్నుల విభాగంలోని ఉన్నతాధికారుల హోదాలను పునర్వ్యవస్థీకరించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్పులను తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న ‘సేల్స్ టాక్స్ కమిషనర్’ పోస్టు పేరును ఇకపై ‘చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్’గా మార్చారు. అలాగే.. అదనపు కమిషనర్ (గ్రేడ్ 1) హోదాను ‘స్టేట్ టాక్స్ కమిషనర్’గా మారుస్తూ చట్ట సవరణ చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలలోని ఉన్నతాధికారుల హోదాలతో తెలంగాణ అధికారుల హోదాలను సమన్వయం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

**ఈ బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ మార్పుల వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఆర్థిక భారం గానీ, నష్టం గానీ ఉండదని స్పష్టం చేశారు. కేవలం పరిపాలనాపరమైన సౌలభ్యం, మెరుగైన కమ్యూనికేషన్ , సమన్వయం కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అధికారుల హోదాల్లో మార్పులు చేయడం ద్వారా జీఎస్టీ అమలులో ఎదురయ్యే టెక్నాలజీ పరమైన ఇబ్బందులను అధిగమించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి వివరణతో సంతృప్తి చెందిన సభ, చివరగా బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.**




## తెలంగాణలో పెట్రోల్, ఎల్పీజీ కొరత లేదు

### సోషల్ మీడియాలో వదంతులు నమ్మొద్దు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. పెట్రోల్ బంకుల వద్ద రద్దీ నేపథ్యంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇంధన నిల్వలపై ఈ మేరకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వదంతులు చూసి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ , వంటగ్యాస్ సరఫరాపై వస్తున్న వదంతులను సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కొట్టిపారేశారు. రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియాకు కీలక విషయాలను వెల్లడించారు. నిన్న ఒక్కరోజే ఆయిల్ కంపెనీలు 2123 ట్యాంకర్ల ద్వారా పెట్రోల్‌ను సరఫరా చేశాయి. సాధారణంగా రాష్ట్రంలో రోజువారీ పెట్రోల్ వినియోగం 5883 కిలో లీటర్లు ఉండగా, నిన్న ఏకంగా 10,799 కిలో లీటర్లను పంపిణీ చేశారు. అంటే సాధారణం కంటే 84 శాతం అదనంగా సరఫరా జరిగింది. అలాగే 22,127 కిలో లీటర్ల డీజిల్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్‌లోని 596 అవుట్‌లెట్ల వద్ద రద్దీని తగ్గించేందుకు సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్ , లీగల్ మెట్రాలజీ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారు. దీనివల్ల నిన్నటితో పోలిస్తే ఈరోజు బంకుల వద్ద రద్దీ గణనీయంగా తగ్గింది.

రాష్ట్రంలో 1.28 కోట్లకు పైగా డొమెస్టిక్ ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు సగటున 2.20 లక్షల బుకింగ్స్ జరుగుతుండగా.. నిన్న 2,19,980 సిలిండర్లను వినియోగదారులకు చేరవేశారు. అయితే.. కొరత ఉందన్న భయంతో వినియోగదారులు ఒకేసారి పెద్ద సంఖ్యలో బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఒత్తిడి ఏర్పడుతోందని.. నిల్వలు సరిపడా ఉన్నాయని ఆయన వివరించారు. మరోవైపు 1.03 లక్షల పీఎన్జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్ల ద్వారా 2.78 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిరంతరాయంగా అందుబాటులో ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఎన్జీ, సీఎన్జీ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని నిర్ణయించారు. కొత్త ప్లాంట్లకు 24 గంటల్లోనే అనుమతులు ఇవ్వడంతో పాటు పలు రాయితీలు కల్పించనున్నారు. రాబోయే 60 రోజులకు సరిపడా స్టాక్ ఉందని, సోషల్ మీడియా వదంతులను నమ్మి అనవసరంగా నిల్వ చేసుకోవద్దని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## 217 కోట్ల జీఎస్టీ స్కాం




**హైదరాబాద్, సిటీ టైమ్స్**

రెండు తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న జీఎస్టీ మోసాన్ని డైరెక్టరేట్ జనరల్ అఫ్ జీఎస్టీ ఇంటలిజెన్స్ అధికారులు వెలుగులోకి తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించిన ఈ సిండికేట్ ద్వారా సుమారు రూ. 217 కోట్ల ఫేక్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దోపిడీ జరిగినట్లు నిర్ధారణ అయింది. అధికారులు నిర్వహించిన దర్యాప్తులో మొత్తం 72 నకిలీ (షెల్) కంపెనీలు గుర్తించారు. ఇవి కేవలం కాగితాల మీద మాత్రమే ఉండి, ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేకుండా తప్పుడు ఇన్వాయిస్ లను సృష్టించి భారీగా ఐటీసీ క్లెయిమ్ చేస్తున్నట్లు బయటపడింది.

ఈ కుంభకోణంలో నిందితులు చాకచక్యంగా వ్యవహరించారు. అమాయకుల ఆధార్, పాన్ కార్డులతో నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు చేశారు. ఇంకా ఖాళీ షాపులను అద్దెకు తీసుకుని తాత్కాలిక కార్యాలయాలుగా చూపించారు. దీనితో డిజిటల్ లాగిన్ ల ద్వారా ఇన్వాయిస్ లు జారీ చేశారు. ఈ పద్ధతి ద్వారా దాదాపు రూ. 1,472 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి, అందులో రూ. 217 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం కలిగించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ స్కామ్‌కు ప్రధాన సూత్రధారి ధంట్ల ఆదిరెడ్డి (అలియాస్ అంజి రెడ్డి) పరారీలో ఉన్నాడు. కాగా రామావత్ నాగరాజు నాయక్, సిద్దిగోని ప్రభాకర్ అనే ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేశారు అధికారులు.

వీరు నకిలీ డాక్యుమెంట్లు సిద్ధం చేయడం, డమ్మీ యజమానులను ఏర్పాటు చేయడం, జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడైంది. పట్టుబడిన నిందితులపై CGST Act 2017 కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ స్కామ్ లో లబ్ధి పొందిన మరిన్ని వ్యక్తులను గుర్తించేందుకు అధికారులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

## నీరవ్ మోడీకి భారీ షాక్

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

నీరవ్ మోడీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని హైకోర్ట్ ఆఫ్ జస్టిస్ తాజాగా నీరవ్ మోడీకి పెద్ద షాక్ ఇచ్చింది. పరారీలో ఉన్న వ్యాపారవేత్త నీరవ్ మోడీని బ్రిటన్ నుంచి భారత్‌కు అప్పగించేందుకు మార్గం దాదాపు సుగమమైంది. భారత్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ తన కేసును తిరిగి తెరవాలని కోరుతూ పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ దాఖలు చేసిన పిటిషన్‌ను లండన్ హైకోర్టు కొట్టివేసింది. రూ. 13,000 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో నీరవ్ మోడీ ప్రధాన నిందితుడు. అతను 2019 మార్చి 19 నుంచి లండన్ జైలులో ఉన్నాడు. మోడీ హైకోర్టు, కింగ్స్ బెంచ్ డివిజన్‌లో ఒక పిటిషన్‌ను దాఖలు చేశారు.

క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ తరఫు న్యాయవాది, సీబీఐ బృందం సహాయంతో, అతని అప్పీలుకు వ్యతిరేకంగా బలమైన వాదనలు వినిపించారు. విచారణ నిమిత్తం సీబీఐ దర్యాప్తు అధికారులతో కూడిన ఒక బృందం లండన్‌కు వెళ్లింది. కేసును తిరిగి తెరవాలన్న పిటిషన్, దానికి సంబంధించిన పరిస్థితులు పునఃపరిశీలన చేయాల్సినంత అసాధారణమైనవి కావని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. "ఆయుధాల వ్యాపారి సంజయ్ భండారీ కేసులోని తీర్పు ఆధారంగా ఈ సమీక్ష పిటిషన్‌ను దాఖలు చేసినప్పటికీ, సీబీఐ నిరంతర, సమన్వయ ప్రయత్నాల వల్ల ఈ సవాలును విజయవంతంగా అధిగమించగలిగాం," అని ఇక్కడ జారీ చేసిన ఒక ప్రకటనలో సీబీఐ ప్రతినిధి తెలిపారు. పీఎన్‌బీ కుంభకోణంలో నీరవ్ మోడీని అప్పగించాలని సీబీఐ 2018 నుంచి కోరుతోంది. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడైన నీరవ్ మోడీ, తన మామ మెహుల్ చోక్సీతో కలిసి పీఎన్‌బీని వేల కోట్ల రూపాయల మేర మోసం చేసిన కేసులో భారతదేశంలో విచారణను ఎదుర్కొంటున్నారు. మోడీ ఒక్కరే రూ. 6,498.20 కోట్ల మొత్తాన్ని దుర్వినియోగం చేశారని సీబీఐ ప్రతినిధి తెలిపారు.





## వనపర్తి లో మైనర్ బాలికపై అత్యాచారయత్నం

- కామాంధున్నీ వెంటనే కఠినంగా శిక్షించాలి
- బాలికకు న్యాయం చేయాలని అడిగితే అక్రమ కేసులా..?ప్రశ్నించే గొంతుకులపై ఎం.ఎల్.ఏ కుట్ర
- అక్రమ అరెస్టులకు నిరసనగా బి అర్ ఎస్ పోలీసు స్టేషన్ ముట్టడి
- బేషరతుగా నాయకులను విడుదల చేయాలీ...

**వనపర్తి సిటీ టైమ్స్ మార్చ్ 26**

వనపర్తి జిల్లా కేంద్రంలోని అక్షర స్కూల్లో మూడవ తరగతి చదువుతున్న చిన్నారిపై పాఠశాలలో వార్డెన్ గా పనిచేస్తున్న 19 సంవత్సరాల యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటన ఒకరోజు ఆలస్యంగా వెలుగు చూసింది. సోమవారం అక్షర స్కూల్ లో మైనారిటీ బాలికపై జరిగిన అత్యాచారాన్ని ప్రశ్నించడానికి బి అర్ ఎస్. ప్రజా సంఘాలు ముస్లిం నాయకులు వెళ్లగా వారిపై పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని బి అర్ ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం వనపర్తి టౌన్ పోలీస్టేషన్ ను ముట్టడించారు. నందిమల్ల.అశోక్, చీర్ల.చందర్,మెకానిక్.శ్రీను మరో 6మందిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు.బి.ఆర్.ఎస్ నాయకులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పలుస రమేష్ గౌడ్ ఆధ్వర్యములో అక్రమంగా అరెస్టు చేసిన నాయకుల్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆడపిల్లపై అత్యాచారం చేసిన నిందితున్ని యాజమాన్యాన్ని కాపాడాలని ఎం.ఎల్.ఏ చేసిన భారీ కుట్రలో బాగంగా నాయకులను అరెస్ట్ చేశారని వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వపరంగా బాధిత బాలికకు,కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షములో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంచేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజశేఖర్ గౌడ్, పెద్దిరాజు, కాగితాల లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్ మున్సిపల్ కౌన్సిలర్సు మురళి సాగర్ శ్రీకర్ గౌడ్ చింటూ సమద్ స్టార్ రహీం, ధర్మ నాయక్, హేమంత్ ముదిరాజ్, జోహేర్ హుస్సేన్, సూర్యవంశం గిరి, యుగంధర్ రెడ్డి, చిట్యాల రాము,సి.పి.ఎం నాయకులు పరమేశ్వరా చారి , సి.పి. ఐ నాయకులు గోపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు



## కీసర జంక్షన్‌లో జోనల్ ఆకస్మిక తనిఖీ





- కీసరలో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీ హల్‌చల్..
- ప్రకటనల కొత్త విధానానికి ప్రాంగణ స్థాయిలో అమలు..
- ప్రజా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి.. కొత్త ఏర్పాట్ల సూచనలు..
- అమలు వేగంపై హెచ్చరిక..

**జోనల్ కమిషనర్ కఠిన ఆదేశాలు..**

**కీసర, మార్చి 26 ( సిటీ టైమ్స్ ):**

కీసర సర్కిల్ పరిధిలోని కీసర జంక్షన్ గురువారం ఉదయం మున్సిపల్ అధికారుల కదలికలతో సందడిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న కొత్త ప్రకటన విధానానికి అనుగుణంగా చేపట్టిన ప్రాంగణ పరిశీలన కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ స్వయంగా పర్యవేక్షించడం విశేషం. ప్రాంగణ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన ఆయన, ప్రకటనల అమలులో పారదర్శకత, నియమ నిబంధనల పాటింపు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రజా ప్రదేశాల్లో ప్రకటనల ఏర్పాటులో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజల భద్రతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో కీసర జంక్షన్ వద్ద ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పెరుగుతున్న రాకపోకలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా బస్ ఆశ్రయాలు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రజలకు శుభ్రతతో కూడిన ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. ఈ చర్యలు ప్రజల దైనందిన అవసరాలను తీర్చడంలో కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు.డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంతకు ఈ పనులను వేగవంతంగా అమలు చేయాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. నగరాభివృద్ధిలో భాగంగా చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ పరిశీలనలో వ్యర్థాల నిర్వహణ విభాగానికి చెందిన అధికారులు సంతోష్ కుమార్, అనిల్ పాల్గొన్నారు. వారు ప్రస్తుత పరిస్థితులపై నివేదికలు సమర్పించగా, వాటి ఆధారంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వెలువడ్డాయి. కీసర సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులకు వేగం పెంచే దిశగా ఈ ఆకస్మిక పరిశీలన కీలకంగా మారింది. కొత్త ప్రకటన విధానం అమలుతో నగరంలో క్రమబద్ధత, ఆదాయ వృద్ధి సాధ్యమవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. అలాగే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో ఈ చర్యలు మైలురాయిగా నిలవనున్నాయి.

## మరో 4 రోజులు రాష్ట్రంలో వర్షాలు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**



బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈ ప్రభావంతో తెలంగాణలో గత వారం రోజులుగా తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో వడగండ్ల వాన కురిసింది. అయితే మరో మూడు నాలుగు రోజుల పాటు ఇదే మాదిరి వాతావరణ పరిస్థితులు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు మరియు ఈదురుగాలులతో (గంటకు 3040 కి.మీ) కూడిన వర్షాలు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్,కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది. ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చు. అంతేకాకుండా నిర్మల్, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, గ్ద్వాల జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

మార్చి 28 ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులు (గంటకు 4050 కి.మీ) తో కూడిన వర్షాలు ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో కురిసే అవకాశం ఉంది. ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

మార్చి 29వ తేదీన ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులు (3040 కి.మీ) తో కూడిన వర్షాలు నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాలలో కురిసే అవకాశం ఉంది. మార్చి 30వ తేదీ నుంచి తేలికపాటి వర్షాలు మాత్రమే ఉంటాయి. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.





# 13 లక్షలమంది ఏజెంట్లతో దేశ ప్రజలకు సేవలు అందిస్తున్న ఎల్ఐసి!

- లక్షమంది ఉద్యోగులతో నిత్యం కళకళలాడుతున్న ఎల్ఐసి
- దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది మన ఎల్ఐసి
- ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఏజెంట్లదే కీలకపాత్ర
- ఆత్మీయ సమ్మేళనంలో కీలకోపన్యాసం చేసిన ప్రణవ్

**హుజురాబాద్ మార్చ్ 27**
**సిటీ టైమ్స్ ప్రత్యేక ప్రతినిధి**

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎల్ఐసి అంటేనే విశ్వాసానికి ప్రతీకగా ప్రతి ఒక్కరూ భావిస్తుంటారని.. జీవితానికి పూర్తి భద్రత కల్పించేది కూడా ఎల్ఐసి కావడం హర్షించదగ్గ పరిణామమని.. ఎల్ఐసి అంటేనే ప్రతి కుటుంబ పెద్దతో సమానంగా భావించవలసి ఉంటుందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబు వ్యాఖ్యానించారు హుజురాబాద్ పట్టణం కరీంనగర్ రోడ్డులో అగ్నిమాప కేంద్రానికి ఎదురుగా... శ్రీరామ్ సాగర్ మెయిన్ కెనాల్ దగ్గరలో గురువారం జరిగిన ఎల్ఐసి ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ప్రణవ్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ ప్రాంత ఎల్ఐసి ఏజెంట్లతో దాదాపు గంటన్నరకు పైగా అన్ని విషయాల గురించి వారితో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ప్రణవ్ రాకను పురస్కరించుకొని ఎల్ఐసి ఏజెంట్లు పోటీపడి ఆయనను శాలువాలతో.. పూల దండలతో సన్మానించి సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ తన తాతగారైన మాజీ రాజ్యసభ సభ్యులు స్వర్గీయ సింగాపురం రాజేశ్వరరావు ఎల్ఐసి ఏజెంట్లకు సొంత భవనం అంటూ ఒక దానిని నిర్మించాలని నిర్ణయించి అందుకోసం అనేక సంవత్సరాల క్రితమే తగినంత స్థలం రాజేశ్వరరావు కేటాయించారని ప్రణవ్ గుర్తుచేస్తూ.. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఎల్ఐసి బిల్డింగ్ నిర్మాణం కోసం తగినన్ని నిధులు కేటాయిస్తున్నట్లు ఏజెంట్ల హర్షధ్వనాల మధ్య ప్రకటించారు.
ఎల్ఐసి పుట్టుపూర్వోత్తరాల గురించి ఒకసారి ఆలోచిస్తే దాని వెనుక ఉన్న ఘనమైన చరిత్ర మనకు అర్థమవుతుందని తెలిపారు. 1956 సెప్టెంబర్ మొదటి తేదీన మనదేశంలో ఎల్ఐసి స్థాపించబడిందని.. అప్పట్లో దేశవ్యాప్తంగా ఉన్న 245 భీమా కంపెనీలన్నింటినీ విలీనం చేసి ఎల్ఐసి పేరుతో ఒకే ఒక సంస్థను ఆ రోజులలో ఏర్పాటు చేయడం జరిగిందని ప్రణవ్ గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 30 కోట్ల మందికి పైగా పాలసీదారులను ఎల్ఐసి కలిగి ఉన్నదని.. ప్రపంచంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థ మనదేశానికి చెందిన ఎల్ఐసి కావడం మనందరం గర్వించదగిన విషయం అన్నారు. దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 2000 కుప్పయ్య బ్రాంచ్ లను ఎల్ఐసి కలిగి ఉందని.. సుమారు లక్ష మంది ఉద్యోగులు ఎల్ఐసి పై ఆధారపడి పని చేస్తూ పరోక్షంగా మరో ఐదు ఆరు లక్షల మంది కుటుంబ సభ్యులను పోషించుకుంటున్నట్లు ప్రణవ్ వివరించారు. అంతేకాకుండా 13 లక్షలకు పైగా ఏజెంట్లను ఎల్ఐసి కలిగి ఉందని.. వీరంతా ప్రతిరోజు పట్టణాల నుండి పల్లెల వరకు తమ వంతు సేవలను అందిస్తున్నారని.. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ ఈ దేశ అభివృద్ధిలో ప్రత్యక్షంగా పరోక్షంగా ఎల్ఐసి కీలకపాత్రను పోషిస్తున్నదని.. ఒక విధంగా చెప్పాలంటే ఈ దేశంలో పొదుపు అనే బృహత్తర కార్యక్రమాన్ని.. అలవాటును ప్రారంభించిన మొదటి సంస్థ ఎల్ఐసి కావడం హర్షనీయమని.. హుజురాబాద్ ఎల్ఐసి బ్రాంచ్ లో సుమారు 750 మంది ఏజెంట్లు తమ వంతు సేవలను..సహాయ సహకారాలను ఈ ప్రాంత ప్రజలకు నిర్విరామంగా అందజేస్తూ ఎల్ఐసి పేరు ప్రఖ్యాతులను చాటుతున్నారని ఈ సందర్భంగా ప్రణవ్ కొనియాడారు. ఏజెంట్లు తమ సమస్యల పరిష్కారం కోసం తనను సంప్రదిస్తూ ఉండాలని కోరారు. హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ ప్రణవ్ నేతృత్వంలో ఈ ప్రాంత ఎల్ఐసి ఏజెంట్ల కోసం భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎల్ఐసి ఏజెంట్ల పాత్ర చాలా ప్రశంసనీయమైనదని... వేలాది కుటుంబాలలో వెలుగులు నింపిన చరిత్రకు ఎల్ఐసి ఏజెంట్లు నిలువెత్తు సాక్షులుగా సుహాసిని వారిని అభివర్ణించారు.

**చనుమల్ల ప్రసాద్ కు ఆర్థిక సహాయం అందించిన ప్రణవ్..**

గత కొంతకాలంగా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ.. కుటుంబాన్ని సైతం పోషించుకోవడానికి బాహ్య ప్రపంచానికి చెప్పుకోలేని స్థితిలో ఉన్న ప్రముఖ ఎల్ఐసి ఏజెంట్ చనుమల్ల ప్రసాద్ బాబుకు ఈరోజు జరిగిన ఏజెంట్ల ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ప్రణవ్ బాబు తన చేతుల మీదుగా 20500 నగదును అందజేశారు. హుజరాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని ఈ కార్యక్రమంలో ప్రణవ్ వెంట పాల్గొన్నారు. హుజురాబాద్ ప్రాంతంలో పనిచేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు ఈ నిధిని సమకూర్చి బాధితుడైన సహచర ఎల్ఐసి ఏజెంట్ చర్మళ్ల ప్రసాద్ కు ప్రణవ్ చేతుల మీదుగా అందించడం పట్ల కార్యక్రమానికి విచ్చేసిన అనేకమంది ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్లను అభినందించారు. గత అనేక సంవత్సరాలుగా తన కుటుంబానికి.. తన ఆరోగ్య పరిస్థితులు మెరుగు పడటానికి ఆర్థిక చేయూతను ఇస్తున్న ఎల్ఐసి ఏజెంట్లకు.. ఎల్ఐసి సంస్థకు తన కుటుంబం తరపున ప్రసాద్ బాబు కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు.

# విద్యుత్ నైపుణ్య కార్మికుల హక్కుల పోరాటం

- రేయింబవళ్లు పని చేస్తున్నా గుర్తింపు లేక ఆవేదన..
- విద్యాహారత ఆధారంగా మార్పిడి చేయాలని డిమాండ్..
- గుర్తింపు లేని కార్మికులకు హోదా ఇవ్వాలని గళమెత్తింపు..
- సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమం ఉధృతం హెచ్చరిక..



నాగారం, మార్చి 26 (సిటీ టైమ్స్ ): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాగారం పరిధిలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నైపుణ్య కార్మికులు ఆగ్రహంతో రగిలిపోయారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ శాఖలో నైపుణ్య కార్మికులుగా విధులు నిర్వర్తిస్తూ, అధికారులు చేయలేని కష్టతరమైన పనులను సైతం తమ భుజాలపై మోస్తూ రేయింబవళ్లు ప్రజలకు సేవలు అందిస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య కార్మికులు తమ హక్కుల కోసం సంయుక్త చర్య సమితి ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో నాగారంలో కూడా పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. విద్యుత్ శాఖ విభాగ ఇంజనీర్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ నిరసనలో నైపుణ్య కార్మికులు తమ సమస్యలను గట్టిగా వినిపించారు. గత ప్రభుత్వం మాయమాటలతో కాలం గడిపిందని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాహారత ఆధారంగా తమకు మార్పిడి కల్పించాలని, పాత విద్యుత్ బోర్డు నిబంధనలు అమలు చేయాలని, అర్హత కలిగిన వారిని కార్మికులుగా గుర్తించాలని కోరారు. ఇక విద్యుత్ సరఫరా సంస్థల పరిధిలో పని చేస్తున్న గుర్తింపు లేని కార్మికులను నైపుణ్య కార్మికులుగా గుర్తించాలని, పీసీ రేటు కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 11 ప్రకారం నెలలో ముప్పై పనిదినాలు, కనీస వేతనాలు అమలు చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కీసర విభాగ సంయుక్త చర్య సమితి చైర్మన్ ఎం డి జహంగీర్, కన్వీనర్ శాగంటి సత్యం, సహ చైర్మన్ ఆంజనేయులు, సహ కన్వీనర్ రామస్వామి, ఆర్టిసన్లు ఇందిరా, సంగీత, రమేష్, ఆశా, సయ్యద్ అజీముద్దీన్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొని తమ హక్కుల కోసం గళమెత్తారు.
ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న తమలాంటి కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదని ఆర్టిసన్లు ఆవేదన వ్యక్తం చేస్తూ, తక్షణమే చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేశారు..

# రోడ్డు ప్రమాదాలకు బ్రేక్...ప్రాణాలు అమూల్యం

- సురక్షిత ప్రయాణంపై కీసరలో భారీ చైతన్యం..
- విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై కఠిన హెచ్చరికలు..
- మొబైల్, మద్యం డ్రైవింగ్పై పోలీసుల స్పష్టమైన సందేశం..

**కీసర, మార్చి 26 ( సిటీ టైమ్స్ ) :**

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని స్ఫూర్తి కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కీసర పోలీస్ ఇన్స్పెక్టర్ అర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై కీలక సూచనలు చేశారు. ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయడం ప్రమాదకరమని, రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల జరిగే దుష్పరిణామాలను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. అలాగే హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడుతాయని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని హెచ్చరించారు. డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగం ఎంత ప్రమాదకరమో స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు వందమంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకున్నారు..









## నేడు అన్ని రాష్ట్రాల
# సీఎంతో మోదీ భేటీ

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధం నేపథ్యంలో దేశంపై దాని ప్రభావం, పరిణామాలపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశం కానున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎంలతో ప్రధాని మాట్లాడనున్నారు. పశ్చిమాసియా సంఘర్షణపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ అంశంపై ప్రధాని.. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ మాట్లాడారు. కరోనా కాలం నాటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రులతో ప్రధాని సమావేశం కానుండటంతో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారు? ఏం సూచనలు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.
ఇరాన్, ఇజ్రాయెల్ అమెరికా యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాపై ఆందోళనలు నెలకున్నాయి. ఇప్పటికే యుద్ధం కారణంగా చమురు ధరలు భారీగా పెరిగాయి. అయితే, దేశంలో సరిపడా చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నట్టు ప్రభుత్వం ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టత ఇచ్చిన విషయం తెలిసిందే. యుద్ధ పరిస్థితులు, దాని ప్రభావం గురించి బుధవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం కూడా నిర్వహించారు. ఇంధన భద్రత విషయంలో ఆందోళన అవసరం లేదని ఈ సందర్భంగా కేంద్రం వివరించింది.
పశ్చిమాసియా యుద్ధంపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్లో మాట్లాడుతూ.. ''యుద్ధం తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని సృష్టించింది... భారత్ కూడా ఈ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మన వాణిజ్య మార్గాలు ప్రభావితమవుతున్నాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువులు లాంటి అత్యవసర వస్తువుల సాధారణ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారు. వారి భద్రత, జీవనోపాధి భారత్కు ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిలో అనేక నౌకలు చిక్కుకుపోయాయి. వాటిలో పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది ఉన్నారు. ఇది కూడా భారత్కు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో శాంతి, చర్చల ప్రాధాన్యం ప్రపంచానికి తెలియజెప్పేలా ముక్తకంఠంతో మన స్వరం వినిపించడం అవసరం'' అని అన్నారు.
యుద్ధం మొదలైనప్పటి నుంచి అనేక దేశాల నాయకులతో తాను మాట్లాడానని, నిరంతరం చర్చలు జరుపుతున్నామని ప్రధాని వివరించారు. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం భారత్పై వీలైనంత తక్కువగా ఉండేలా నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని మోదీ తెలిపారు. అందుకు మన ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్ఠంగా ఉండటమే కారణమని పేర్కొన్నారు.మరోవైపు, యుద్ధ భూమిలో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్న కేంద్రం.. ఇప్పటి వరకూ 4.25 లక్షల మంది భారత్కు తీసుకొచ్చింది. ఇరాన్ నుంచి 1000 మంది రాగా.. వీరిలో 700 మంది విద్యార్థులు ఉన్నారు.

# వైన్ షాపులకు పెట్టిన దేవుళ్ల పేర్లను తొలగించాలి

**హైదరాబాద్, సిటీటైమ్స్**

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు హాట్ హాట్గా సాగుతున్నాయి. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సహా అనేక అంశాలపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా బీజేపీ నేత, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ సరికొత్త డిమాండ్ చేశారు. వైన్స్లకు దేవుడి పేర్లు తీసేయాలని.. అదే సమయంలో దేవుడి పేర్లు పెట్టకుండా చట్టాలు తీసుకురావాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మద్యం షాపులకు దేవుని పేర్లను తీసేయాలని డిమాండ్ చేశారు.
అదే సమయంలో ఇక నుంచి పెట్టే మద్యం షాపులకు కూడా దేవుడి పేర్లు పెట్టకుండా కొత్తగా చట్టాలు తీసుకురావాలని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ.. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేవుళ్ల పేర్లను మద్యం దుకాణాలకు పెట్టి.. హిందూ మతాన్ని తీవ్రంగా అవమానిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మద్యం దుకాణాలకు దేవుళ్ల పేర్లు పెట్టే వ్యవహారంపై తెలంగాణ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇక నుంచి వైన్స్లకు లైసెన్సులు ఇచ్చే సమయంలోనే వాటికి దేవుళ్ల పేర్లను పెట్టకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు.
మరోవైపు.. తెలంగాణ వ్యాప్తంగా వేల సంఖ్యలో మద్యం దుకాణాలు ఉండగా.. వాటిలో చాలా వైన్ షాపులకు దేవుడి పేర్లే ఉండటం గమనార్హం. సాధారణంగా దుర్గ వైన్స్, కనక దుర్గ వైన్స్, బాలాజీ వైన్స్, శ్రీ వేంకటేశ్వర వైన్స్, రేణుక ఎల్లమ్మ వైన్స్, మైసమ్మ తల్లి వైన్స్ అంటూ అనేక రకాల హిందూ దేవతల పేర్లను మద్యం దుకాణాలకు పెట్టుకుని నడిపిస్తున్నారు. అయితే మద్యం దుకాణాలకు హిందూ దేవుళ్ల పేర్లను పెట్టుకుంటే.. బాగా గిరాకీ వస్తుందని వారు భావిస్తూ ఉంటారు.
ఇక.. బుధవారం రోజున ఇప్ప సారా అంశం తెలంగాణ అసెంబ్లీని కుదిపేసింది. ఇప్ప సారా వినియోగం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సభలో ప్రస్తావించారు. రాష్ట్రంలో ఇప్ప సారా కోసం ప్రత్యేక కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. అయితే దీనిపై స్పందించిన బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి.. ఇప్ప సారా పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టొద్దంటూ చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఇందిరాగాంధీని అవమానించేలా రాకేష్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని.. వెంటనే వాటిని వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలంటూ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాకేష్ రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.



సిటీటైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



## మార్కాపురం బస్సు ప్రమాదం

# 13 మంది సజీవ దహనం

- పలకల క్వారీ వద్ద టిప్పర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం
- ముగ్గురి పరిస్థితి అత్యంత విషమం
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం
- ఎక్స్ గ్రేషియాపై ప్రధాని మోదీ ప్రకటన
- చనిపోయిన వారికి 2 లక్షలు, గాయపడిన వారికి 50వేలు

**మార్కాపురం, సిటీ టైమ్స్**

గురువారం ఉదయం.. మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం.. తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా వణికించింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా నుంచి 35 మందితో వెళ్తున్న హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఆ ప్రైవేటు బస్సు.. రాయవరం సమీపంలోకి రాగానే పలకల క్వారీ వద్ద టిప్పర్‌ను ఢీకొట్టడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనం అయ్యారు. మరో 22 మందికి తీవ్ర గాయాలు అయినట్లు అధికారులు వెల్లడించారు. వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అయితే ఈ బస్సు ప్రమాదం.. బాధిత కుటుంబాలకు అంతులేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఇప్పటి దాకా 13 మంది మృతదేహాలను బయటికి తీశారు. ఇక ఈ బస్సు ప్రమాదానికి సంబంధించి తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బస్సు కండీషన్ సరిగా లేదని.. ప్రమాదానికి ముందే అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆ బస్సు పరిస్థితి బాగా లేదని ముందే డ్రైవర్‌తో చెప్పారు. ఈ క్రమంలోనే యర్రగొండపాలెం వద్ద బస్సును గంట సేపు నిలిపేసిన డ్రైవర్.. దానికి మరమ్మతులు చేసినట్లు ప్రయాణికులు వెల్లడించారు. రిపేర్ల తర్వాత బస్సు బయల్దేరి కొంత దూరం వెళ్లిన తర్వాత రాయవరం వద్ద ఈ ఘోర ఘటన జరిగినట్లు చెప్పారు. ఈ ప్రమాదం తర్వాత అధికారులు బస్సు డ్రైవర్‌ను విచారణ జరపగా.. స్టీరింగ్ స్ట్రక్ అయినట్లు చెప్పినట్లు సమాచారం.

కానీ ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయట పడిన బస్సు క్లీనర్ మహేంద్ర వాదన మాత్రం మరో రకంగా ఉంది. బస్సు ప్రమాదం నుంచి మొట్టమొదటగా తానే ప్రాణాలతో బయటపడినట్లు తెలిపాడు. తాను నిద్రపోతున్న సమయంలో ప్రమాదం జరిగిందని.. లేచి చూసేసరికి బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుందని పేర్కొన్నాడు. మంటలను ఆర్పే సిలిండర్లు బస్సులో ఉన్నాయని.. కానీ దట్టమైన పొగ కారణంగా అవి కనిపించలేదని వివరించాడు. చాలా మంది అద్దాలు పగలగొట్టి బయటపడి ప్రాణాలు రక్షించుకున్నారని తెలిపాడు. బస్సు కండీషన్ బాగానే ఉందని క్లీనర్ మహేంద్ర చెప్పాడు.

మరోవైపు.. ఈ మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. ఈ ఘటనలో చనిపోయిన వారికి ఏపీ కేబినెట్ సంతాపం తెలియజేసింది. అదే సమయంలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. ఇక ఈ ఘోర ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు.. గాయాల పాలైన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. బాధితులకు మెరుగైన ట్రీట్‌మెంట్ అందించాలని.. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బస్సు ప్రమాదంపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ప్రమాదం తీరుపై ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు అనిత, జనార్దన్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మరోవైపు.. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. బస్సు మంటల్లో కాలి బూడిదై అందులో ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత విషాదమని మోదీ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ఉన్న వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇక మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు.. గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది.

మార్కాపురం బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ బస్సు ప్రమాద ఘటనపై ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. ప్రమాదానికి గురైన బస్సు జగిత్యాల నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఇక్కడి ప్రయాణికులు ఎవరైనా ఉన్నారా అనే వివరాలు తెలుసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఏపీ సీఎస్‌తో తెలంగాణ సీఎస్ మాట్లాడారు.

**ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన కేబినెట్**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై విస్తృతంగా చర్చించారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి కేబినెట్ సభ్యులు సంతాపం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గాయపడిన వారికి అందుతున్న వైద్యసేవలను మంత్రులు, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇక భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు రోడ్లు & భవనాల శాఖ, రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదనంగా, ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, దానికి అనుగుణంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యల ద్వారా బాధిత కుటుంబాలకు సహాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో ప్రమాదాలు నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మృతుల వివరాలు ఇవే..!

1. అంబటి అనిల్ 26సం. పెద్దరికట్ల, కేకే మెట్ల మండలం..
2. అంబటి అనిల్ కుమారుడు (5 నెలల బాబు)
3. బండారు పద్మ (28) కనిగిరి
4. ముత్తంగి వెంకటేశ్వర్లు (40) - దాసరికల్లు గ్రామం,ఉదయగిరి మండలం..
5. తమ్మిశెట్టి పిచ్చమ్మ - చల్లసిరలగల గ్రామం, కనిగిరి.
6. తమ్మిశెట్టి రుక్మిణి - చల్లసిరలగల గ్రామం, కనిగిరి.
7. ఉప్పు రమాదేవి. - రంగారెడ్డి పల్లె గ్రామం, కనిగిరి.
8. మహేంద్ర - పొదిలి.
9. ప్రభావతి - పొదిలి.
10. కత్తి జయరాములు, - పొదిలి.
11. ఆత్మకున చిన్న (45) - కనిగిరి.
12. దేవేంద్ర రామయ్య. - కనిగిరి.
13. చైత్ర.
14. జ్యోతి.



# దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతూ విశ్వ నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. నగరంలో ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన వారు కూడా నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఈ మేరకు హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని మెట్రో నగరాలన్నింటిని వెనక్కి నెట్టి 'నివసించడానికి అత్యంత అనుకూలమైన నగరం'గా అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ సంస్థ అన్‌బాక్సింగ్ బీఎల్ఆర్ తాజాగా విడుదల చేసిన 'WeAreCity 2026' నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.



దేశంలోని ఎనిమిది ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే.. హైదరాబాద్ అన్ని రంగాల్లోనూ సత్తా చాటింది. పటిష్టమైన రియల్ ఎస్టేట్ మార్కెట్, సామాన్యుడికి అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఇలా పలు ప్రత్యేకతలు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయి. ఒకప్పుడు బెంగళూరు మాత్రమే ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది, కానీ ఇప్పుడు బెంగళూరు ఆధిపత్యానికి హైదరాబాద్ సవాల్ విసురుతోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఉద్యోగ కల్పనలో హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.

ఈ నివేదిక ప్రకారం.. హైదరాబాద్, బెంగళూరు నగరాలు కలిసి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జనాభా పరంగా ముంబై, ఢిల్లీ ఎంతో పెద్దవైనప్పటికీ.. ఆర్థిక వృద్ధిలో మాత్రం ఈ రెండు నగరాలు వాటిని మించిపోతున్నాయి. పదేళ్ల క్రితం దేశంలోని టాప్8 నగరాల్లో కొత్త కంపెనీల ఏర్పాటులో ఈ రెండు నగరాల వాటా 15 శాతం ఉండగా.. గత ఆర్థిక సంవత్సరం నాటికి అది 25 శాతానికి పెరిగింది. కార్యాలయాల విస్తరణ, గృహ రుణాల మంజూరు, విమాన ప్రయాణాలు, విద్యార్థుల చదువు వంటి అంశాల్లో ఈ రెండు నగరాలు అగ్రగామిగా ఉన్నాయి.

రంగారెడ్డి జిల్లా దేశంలోని అత్యంత ధనిక జిల్లాల్లో ఒకటిగా నిలిచింది. ఆఫీస్ స్పేస్ అద్దె విషయానికి వస్తే.. బెంగళూరుకు హైదరాబాద్ కేవలం 15 శాతం దూరంలోనే ఉంది. కొత్త కంపెనీల ఏర్పాటులో బెంగళూరుతో హైదరాబాద్ సమంగా నిలవడం విశేషం. అయితే ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు, సోషల్ ఈవెంట్స్, వినోదంపై పెట్టే ఖర్చుల విషయంలో బెంగళూరు నగరవాసులు ముందుండగా.. హైదరాబాద్ ప్రజలు గృహ నిర్మాణం వంటి సంప్రదాయ పెట్టుబడులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

అభివృద్ధి ఎంత ఉన్నా.. రవాణా విషయంలో రెండు నగరాలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ఆ రిపోర్టు వెల్లడించింది. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ విపరీతంగా ఉంది. హైదరాబాద్‌లోనూ ఐటీ కారిడార్లలో ఆఫీసులకు వెళ్లే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. బెంగళూరు కంటే హైదరాబాద్‌లో వాహనాల వేగం 20 శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ.. ప్రయాణ సమయం మాత్రం దాదాపు సమానంగా ఉండటం గమనార్హం. ఈ రిపోర్టు ప్రకారం.. మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాల మెరుగుదలతో హైదరాబాద్ ఇప్పుడు దేశానికే తలమానికంగా, బెస్ట్ సిటీగా నిలిచింది.

## భారత్.. పాకిస్థాన్ లాంటి

# 'బ్రోకర్ దేశం' కాదు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

అంతర్జాతీయ దౌత్యంలో తనకంటూ ఓ పాత్ర కోసం పాకులాడుతున్న పాకిస్థాన్.. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధంలో ఇరాన్, అమెరికా చర్చలకు మధ్యవర్తిత్వం కోసం చేస్తున్న ప్రయత్నాన్ని భారత్ ఎద్దేవా చేసింది. పాకిస్థాన్ మాదిరిగా మనది బ్రోకర్ దేశం కాదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియా యుద్ధంపై ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఇస్లామాబాద్ ఓ బ్రోకర్ అని అభివర్ణిస్తూ ఆయన తీవ్రంగా విమర్శించారని పేర్కొన్నాయి. 'పాకిస్థాన్ మాదిరిగా భారత్ మధ్యవర్తిత్వం, బ్రోకర్ పనులు చేయదు' అని జైశంకర్ అన్నట్టు వివరించాయి.



పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా వాషింగ్టన్, టెహ్రాన్‌ల మధ్య మధ్యవర్తిత్వానికి పాకిస్థాన్ ముందుకొచ్చింది. సంఘర్షణకు పరిష్కార మార్గం సుగమం చేయాలనే తన ఆసక్తిని వ్యక్తం చేస్తూ పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షేర్ చేయడంతో రహస్య దౌత్యంపై ఊహాగానాలు మరింత బలపడ్డాయి. అమెరికా, పాక్‌ల మధ్య సంప్రదింపుల కోసమే ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీలో ప్రత్యేకంగా 'ఆసక్తుల విభాగం'ను నిర్వహిస్తోందని, దాయాది 1981 నుంచి ఈ పని చేస్తోందని ఒక మూలం తెలిపింది.

వాషింగ్టన్, ఇస్లామాబాద్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాల కారణంగానే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము నిర్వహించిన తీరును కూడా ప్రభుత్వం సమర్థించుకుందని వారు తెలిపారు. ఇరాన్‌పై దాడులను ఖండించకపోవడం, విధానపరమైన అస్పష్టతపై వస్తున్న విమర్శలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రకటనలు, దౌత్యపరమైన సంప్రదింపులు, సంబంధిత వర్గాలన్నిటితో చర్చల ద్వారా భారత్ ఈ విషయంలో నిమగ్నమై ఉందని పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాలు వివరించాయి.

అంతేకాదు, యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటి వరకూ గల్ఫ్ దేశాల నుంచి 4.25 లక్షల మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చినట్టు అఖిల పక్ష సమావేశంలో చెప్పినట్టు తెలుస్తోంది. యుద్ధ భూమిలో చిక్కుకున్న మిగతా భారతీయుల భద్రత, వారిని సురక్షితంగా తీసుకొచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి ఉద్ఘాటించింది.

ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు 15 ఏళ్లకు పైగా అమల్లో ఉన్నప్పటికీ, ఆ దేశం నుంచి చమురు కొనుగోలు భారత్ కొనసాగిస్తోందని కూడా ప్రభుత్వం నొక్కిచెప్పినట్టు వారు తెలిపారు.

ఇంధన భద్రత విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ లభించిందని వర్గాలు తెలిపాయి. భారత్ ముడి చమురు దిగుమతులలో ఎక్కువ మొత్తం రష్యా నుంచి వస్తుందని సమావేశంలో హైలైట్ చేశారని, ఇది ఆచరణాత్మక, వైవిధ్య భరితమైన ఇంధన వ్యూహాన్ని నొక్కి చెబుతోందని వారు తెలిపారు. అంతేకాదు, భారత్‌కు అమెరికా అతిపెద్ద వ్యాపార భాగస్వామి అని, ఇజ్రాయెల్ కీలక సాంకేతిక, వ్యూహాత్మక భాగస్వామి అని సమావేశంలో హైలెట్ చేశారు. జాతీయ ప్రయోజనాలను పరిరక్షించుకుంటూనే, ఇరాన్‌తో కొనసాగుతున్న సంప్రదింపులు సహా పశ్చిమాసియా అంతటా భారతదేశం సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తోందని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం పునరుద్ఘాటించిందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నారు.

## విద్య, వైద్య రంగానికి

# అత్యధిక ప్రాధాన్యం

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసనసభ ముందు వివరించారు.

శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అనేక అంశాలను తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నామన్నారు. పేదలకు జీవిత బీమాను అందించి వారిలో ధీమా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోందని వెల్లడించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి ఏం చెప్పారంటే**

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరగ్య శ్రీ కింద ప్రతి నెలా సగటున రూ. 52 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత 7 డిసెంబర్ 2023 నుంచి 25 మార్చి 2026 కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెట్టింది.

గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టింది. ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. 7 డిసెంబర్, 2023 నాటికి గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ. 600.27 కోట్లు. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 360.16 కోట్ల బకాయి ఉంది.

ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ. 2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాం. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480.52 కోట్లు చెల్లించాం. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 54 కోట్లు అందించాం.

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు. గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ. 100 కోట్లు మాత్రమే. ఇందులోనూ ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా రూ. 496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 231.44 కోట్లు ఉంది.

రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నాం.

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందే. అందుకని మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించాం.

నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి.

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుంది. చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నాం.

పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నాం. వైద్యులకే హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడం వల్ల వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయి. అందుకని నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నాం.


విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు తల్లిదండ్రుల కోసమో, ఇతర పనుల కోసం రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను క్రియేట్ చేస్తున్నాం.

సమాజంలో వైద్య రంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తాం. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం.

విద్య పరంగా నర్సరీ నుంచి 10 వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నాం.' అని ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు.

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థపై కీలక ప్రసంగం చేశారు. గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన ఆర్థిక భారాలను మోస్తూనే, పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలు, సీఎం రిలీఫ్ ఫండ్ దుర్వినియోగం, నూతన బీమా పథకాలపై ఆయన సభలో గణాంకాలతో సహా వివరణ ఇచ్చారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందన్న ప్రతిపక్షాల విమర్శలను ముఖ్యమంత్రి తిప్పికొట్టారు. "మేము అధికారంలోకి వచ్చే నాటికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుండి 627 కోట్ల రూపాయల బకాయిలు వారసత్వంగా వచ్చాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు 240 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు 360 కోట్ల రూపాయల బాకీ ఉంది. ఆ భారాన్ని మోస్తూనే, మేము వచ్చాక ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రులకు 927 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు 1480 కోట్ల రూపాయలను విడుదల చేశాం" అని ఆయన వివరించారు. ప్రస్తుతం రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున 89 కోట్ల నుండి 90 కోట్ల రూపాయల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచినట్లు సీఎం గుర్తు చేశారు. ఇది చాలదన్నట్టుగా, రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు ధీమా కల్పించేందుకు నూతనంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. ఒకవేళ కుటుంబ పెద్దను కోల్పోతే, ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోకుండా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు విపరీతంగా దుర్వినియోగం అయ్యాయని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "సీఎంఆర్ఎఫ్ నిధుల చెక్కులను కొందరు పీఏలు అక్రమంగా కాజేశారని, దీనిపై ఇప్పటికే కేసులు నమోదై అరెస్టులు జరుగుతున్నాయి. మేము వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు 2040 కోట్ల రూపాయలను పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించాం" అని వెల్లడించారు. ప్రభుత్వ టీచింగ్ ఆసుపత్రుల పనితీరుపై కూడా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. "టీచింగ్ కాలేజీల్లో నిపుణులైన వైద్యులు ఉన్నప్పటికీ, పేషెంట్లు అక్కడికి వెళ్లడం లేదనే విషయాన్ని గమనించాం. పేషెంట్లకు ప్రొఫెషనల్ ట్రీట్మెంట్ అందేలా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాం. సూపరింటెండెంట్లకు అదనపు బాధ్యతలు అప్పగించి, ఆసుపత్రుల నిర్వహణను మెరుగుపరుస్తాం" అని ఆయన పేర్కొన్నారు.




# హెపటైటిస్ నుండి లివర్ క్యాన్సర్ వరకు: ముందుగా గుర్తించండి.. త్వరగా చికిత్స చేయండి


వైరల్ హెపటైటిస్ అనేది కేవలం కాలేయ ఇన్ఫెక్షన్ మాత్రమే కాదు. ఇది మనం ఈరోజు చికిత్స చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్‌లలో ఒకటైన హెపటోసెల్యులర్ కార్సినోమా లేదా ప్రైమరీ లివర్ క్యాన్సర్‌కు ప్రధాన కారణం. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా, ఈ నిశ్శబ్ద సంబంధాన్ని నొక్కి చెప్పడం చాలా అవసరమని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ & రోబోటిక్ సర్జన్ డాక్టర్ అజయ్ వరుణ్ రెడ్డి వివరించారు. దీర్ఘకాలిక హెపటైటిస్ బి, సి ఇన్ఫెక్షన్లు ప్రపంచవ్యాప్తంగా 80% కంటే ఎక్కువ కాలేయ క్యాన్సర్ కేసులకు కారణమవుతున్నాయి. భారతదేశంలో 5 కోట్ల మందికి పైగా హెపటైటిస్ బి లేదా సితో జీవిస్తున్నారు. ఇక్కడ లివర్ క్యాన్సర్ తరచుగా గుర్తించబడకుండా, చికిత్సకు వీలుకాని దశకు చేరుకునే వరకు బయటపడదు. విచిత్రం ఏమిటంటే, సరైన సమయంలో గుర్తిస్తే ఈ కేసులలో చాలా వరకు నివారించవచ్చు. లేదా చికిత్స అందించడం ద్వారా నయం చేయొచ్చు.



స్క్రీనింగ్ ఎందుకు అవసరం?

మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో, నిజామాబాద్‌కు చెందిన 56 ఏళ్ల వ్యక్తి ఇటీవల పొత్తికడుపు పైభాగంలో నొప్పి రావడంతో మా వద్దకు వచ్చారు. ఇమేజింగ్ పరీక్షల్లో కాలేయంలో పెద్ద కణితి ఉన్నట్లు తేలింది. తదుపరి పరీక్షల్లో అది హెపటోసెల్యులర్ కార్సినోమా అని నిర్ధారణ అయ్యింది. రక్తాన్ని పరిశీలించగా, అతనికి 20 ఏళ్లకు పైగా హెపటైటిస్ బి ఉందని, అది ఎప్పుడూ నిర్ధారణ కాలేదని, చికిత్స చేయలేదని వెల్లడైంది. ఒకవేళ పదేళ్ల క్రితమే అతని హెపటైటిస్‌ని స్క్రీనింగ్ చేసి ఉంటే, యాంటీవైరల్ చికిత్స అతని క్యాన్సర్ ప్రమాదాన్ని దాదాపు 80% తగ్గించి ఉండేది. ఈ వ్యత్యాసాన్ని మనం పూడ్చాలి. ఈరోజు HBV, HCV లు చికిత్స చేయదగినవి. కొత్త యాంటీవైరల్ చికిత్సలతో, రోగులు వైరస్‌ను అణచివేయవచ్చు. కాలేయ వాపును తగ్గించవచ్చు, క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అయితే ముందుగానే గుర్తించడం అవసరం. మెడికవర్ ఇప్పుడు ప్రతి మాస్టర్ హెల్త్ చెక్, OPD మూల్యాంకనం, అధిక ప్రమాదకర రోగుల ప్రొఫైల్‌లో దీన్ని అనుసంధానిస్తోంది.


కాలేయ క్యాన్సర్ చాలా తీవ్రమైనది, కానీ హెపటైటిస్ స్క్రీనింగ్‌తో ఇది నివారించదగినదిగా మారుతుంది. మెడికవర్ బృందాలు ఆంకాలజీ, హెపటాలజీ, డయాగ్నోస్టిక్స్‌లో ఉన్న






నిపుణులతో కలిసి ఈ వ్యాధిని మూలంలోనే గుర్తించే నైపుణ్యం కలిగి ఉన్నాయి. ఈ హెపటైటిస్ దినోత్సవం నాడు చివరి దశ చికిత్స నుండి ముందుగానే నివారణకు మన దృష్టిని మార్చుదాం. ఎందుకంటే కాలేయ క్యాన్సర్‌పై హెపటైటిస్ పట్ల అవగాహన, చర్యతోనే మొదలవుతుంది.

# 30 ల వయస్సులో ఉన్నవారిలో పెరుగుతున్న ఆత్మహత్య కేసులు; డిప్రెషన్ ఒక్కటే కారణం కాదు..





ఆర్థిక ఒత్తిడి, కుటుంబ సంరక్షణ విధులు మరియు కెరీర్ డిమాండ్లు 30 ఏళ్ళలో బర్న్అవుట్ కు కారణమవుతున్నాయి. ఈ 'శాండ్విచ్ జనరేషన్' పెరుగుతున్న ఆత్మహత్య రేటును ఎదుర్కొంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "ఒక వ్యక్తి ఎదుర్కొంటున్న అనేక ఒత్తిళ్లలో డిప్రెషన్ ఒకటి కావచ్చు, కానీ డిప్రెషన్ తో బాధపడని వ్యక్తి కూడా ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉంది" అని అన్నారు. " 30 ఏళ్ళ వయస్సులో ఉన్నవారు తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడికి గురవుతారు. వారు బహుళ బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. కెరీర్లు, పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, ఆర్థిక అవసరాలను నిర్వహించాల్సి ఉంటుంది.

సోషల్ మీడియా ప్రభావం

పిల్లల పెంపకం, కుటుంబ సంబంధాలు మరియు వృద్ధుల సంరక్షణ 30 ఏళ్ళ వయస్సు వారిలో మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. సమాజ ఆకాంక్షలను చేరుకోవాలనే ఒత్తిడి ఒంటరితనాన్ని పెంచుతుంది. చేరుకోని జీవిత లక్ష్యాల నుండి నిరాశ వైఫల్య భావనలను సృష్టిస్తుందని మానసిక వైద్యుడు డాక్టర్ డేవిడ్ టియో వివరించారు. సోషల్ మీడియాలో ఇతరులతో జీవితాలను పోల్చడం వల్ల ఒత్తిడి పెరుగుతుందని, వెనుకబడిపోయామనే భావన కలుగుతుందని ఆయన అన్నారు.

నెరవేరని లక్ష్యాలు, కలలు

నెరవేరని లక్ష్యాలు, కలలు వైఫల్యం లేదా నిస్సహాయతకు దారితీస్తాయి. అలాగే, ఈ క్లిష్టమైన జీవిత దశలో శారీరక ఆరోగ్య సమస్యలు మరియు కొత్త మానసిక ఆరోగ్య పరిస్థితులు తరచుగా ఉద్భవిస్తాయి. ఈ ఆందోళన భారత్ సహా ప్రపంచదేశాల్లో 30 నుంచి 44 ఏళ్ల మధ్య వయసున్న అందరూ ఎదుర్కొంటున్నారు. భారతీయుల్లో కూడా 30ల వయస్సులో ఉన్నవారు ఆత్మహత్యల ముప్పును ఎదుర్కొంటున్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2022 లో ఆత్మహత్య చేసుకున్నవారిలో 18-30 సంవత్సరాల వయస్సు గలవారు 35% ఉన్నారు. 30-45 సంవత్సరాల వయస్సు గలవారు 32% ఉన్నారు. మొత్తం ఆత్మహత్య మరణాల్లో 67 శాతం ఈ వయసు వారే కావడం గమనార్హం.

భారత్ లో..

భారతదేశంలో ఆత్మహత్యలు 2021 లో 1,64,033 నుండి 2022 లో 1,70,924 కు పెరిగాయని ఎన్సిఆర్బి డేటా తెలిపింది. జాతీయ సగటుతో పోలిస్తే నగరాల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంది. కుటుంబ సమస్యలు (31.7%), అనారోగ్యం (18.4%), వివాహ సమస్యలు (4.8%) ఆత్మహత్యలకు సగానికి పైగా కారణమయ్యాయి. బాధితుల్లో 71.8 శాతం మంది పురుషులు ఉన్నారు. తమిళనాడులో అత్యధిక సామూహిక ఆత్మహత్యలు నమోదు కాగా, ఆ తర్వాత రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఉన్నాయి.

సింగపూర్ లో..

సింగపూర్ లో 2024లో 30-39 ఏళ్ల మధ్య వయసున్న 75 మంది ఆత్మహత్యలు చేసుకోగా, 2023లో 66 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఏ వయసు వారికైనా ఇదే అత్యధికం. ఈ పెద్దలు ప్రత్యేకమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటారని నిపుణులు చెబుతున్నారు. వీరికి అస్థిరమైన ఉద్యోగాలు, కుటుంబ సమస్యలు మరియు మానసిక అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఆత్మహత్యలకు సాధారణంగా నిరాశ లేదా డిప్రెషన్ మాత్రమే కారణం కాదని మనస్తత్వ శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. డిప్రెషన్ తో పాటు పలు ఇతర కారకాల కలయిక వల్ల ఆత్మహత్య భావన సంభవిస్తుందని భావిస్తున్నారు. "అన్ని ఆత్మహత్యలకు డిప్రెషన్ కారణమని తరచుగా భావిస్తారు, కాని ఆత్మహత్య తరచుగా అనేక అంశాలు మరియు జీవిత పరిస్థితుల పరస్పర చర్య వల్ల సంభవిస్తుంది" అని వివరిస్తున్నారు.

## నవ్వులు పూయిస్తూనే భయపెడుతున్న 'రాకాస'




'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో యూత్ లో క్రేజ్ సంపాదించుకున్న యంగ్ హీరో సంగీత్ శోభన్ సోలో హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాకాస'. జీ స్టూడియోస్ సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ బుధవారం ఘనంగా విడుదలైంది. మానస శర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమా హారర్, కామెడీ, ఫాంటసీ అంశాల కలయికతో రూపొందింది. అమెరికా నుంచి ఒక కుర్రాడు (సంగీత్ శోభన్) తన ఊరికి తిరిగి వచ్చినప్పుడు, అక్కడి ఒక పాడుబడ్డ కోట వెనుక ఉన్న మిస్టరీలో ఎలా చిక్కుకున్నాడనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. ఊరు మొత్తం కలిసి ఒక బ్రహ్మరాక్షసుడికి హీరోను బలి ఇవ్వాలని చూడటం, ఆ విపత్కర పరిస్థితుల నుంచి హీరో తన కామెడీ టైమింగ్‌తో ఎలా తప్పించుకున్నాడనేది సినిమాలో ప్రధానాకర్షణగా నిలవనుంది. వెన్నెల కిశోర్, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్న నిహారిక, ఈ 'రాకాస'తో మరో హిట్ కొట్టాలని భావిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## మేం విడిపోవాలని ఎందుకు కోరుకుంటున్నారో!



"మేం విడాకులు తీసుకుంటున్నామంటూ కొన్ని వార్తలు నా చెవిన పడ్డాయి. మా పెళ్లి బంధం ముగిసిపోవాలని కోరుకుంటున్నారా? అస్సలు ఎందుకు మా బంధం గురించి ఇలాంటి రూమర్లు వస్తున్నాయో తెలియడం లేదు. అయినా ఇదంతా వాళ్ల భ్రమ. మా ఇద్దరి మధ్య బంధం కొందరికి ఎందుకు ఇంత ఇబ్బంది కలిగిస్తుందో అర్థం కావడం లేదు. బహుశా వేర్వేరు దేశాలు, వేర్వేరు మతాలు, వయసు తేడా అయి ఉండవచ్చు. మేము ఎనిమిదేళ్లుగా కలిసే ఉంటున్నాం. ఇతరులు ఏమనుకుంటున్నారో అని ఆలోచించడం మానేశా. మా పరిచయం తర్వాత ఆరు నెలల్లోనే పెళ్లి చేసుకున్నాం. అప్పుడు అది నిజమో కాదో కూడా తెలియని పరిస్థితుల్లో ఉండిపోయా. అయితే నిక్‌లో నిజాయతీ ఉంది". "మా కుటుంబ భద్రత విషయంలో కూడా నేను చాలా జాగ్రత్తగా ఉంటా. ముఖ్యంగా మా కుమార్తె గురించి మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తాను. ఎవరైనా నన్ను సంప్రదించి ఫొటోలు తీసుకోవడం నాకిష్టం. నాతో మాట్లాడటానికి వచ్చే వ్యక్తులను నేను ఇష్టపడతానని మా సెక్యూరిటీ గార్డులకు తెలుసు. అనుమతి లేకుండా మమ్మల్ని ఫొటోలు తీయకుండా వారు చూసుకుంటారు. ఈరోజుల్లో ప్రతి ఒక్కరి దగ్గర సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. మేము పార్కులో ఉన్నా.. ఏదైనా తింటున్నా కూడా క్షణాల్లో దాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. అందుకే నా కూతురి కోసం సెక్యూరిటీని పెట్టుకున్నా. లేకపోతే నాకు భద్రత అవసరం లేదు". "నా దృష్టిలో నిజమైన విజయం అంటే నేను ఇష్టపడే వృత్తిలో పనిచేయడం, కుటుంబం కోసం సమయం కేటాయించడం మాత్రమే. జీవితంలో చాలా మంది రోజూ పనిచేయాల్సి ఉంటుంది. కొంతమందికి వారు చేసే ఉద్యోగాలు కూడా నచ్చవు. కానీ వారు బతకడం కోసం, కుటుంబాలను పోషించడం కోసం ఉద్యోగం చేయాలి. నాకు అదే విజయమని భావిస్తున్నా".



## ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి

టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్' అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు.ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## పెళ్లి తర్వాత... పాపం ప్రతాప్

ఇప్పటివరకు ప్రేమలో గెలిచాం.. పెళ్లి తర్వాత ఆ ప్రేమ ఎలా ఉంటుందో చూద్దాం అనుకుంటున్న ఓ జంట చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందుతోంది 'పాపం ప్రతాప్' సినిమా. ఈటీవి విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ లో తిరువీర్, పాయల్ రాధాకృష్ణ జంటగా తెరకెక్కింది. ఈ సినిమాకి ఎస్పీ దుర్గా నరేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. రాకేశ్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా అధికారిక టీజర్‌ను విడుదల చేసింది. 'రేపటి నుంచి మీ ఇద్దరి మధ్య ఏ గొడవైనా జరిగినా.. ఆ గొడవ వల్ల నా పరువు పోయినా.. గుర్తుపెట్టుకో నీ బతుకు నా చేతిలో చేతబడి బొమ్మేరోయ్' అంటూ హీరో తండ్రి డైలాగ్‌తో ఆసక్తికరంగా ఉందీ టీజర్. అజయ్ ఘోష్, రఘుబాబు తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు.






## మరో నాయికగా కృతిశెట్టి?

వచ్చే సంక్రాంతి లక్ష్యంగా ఓ మల్టీస్టారర్ సినిమా సిద్ధమవుతోంది. సంక్రాంతి సినిమాల దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించనున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా నటించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులతోపాటు, నటీనటుల ఎంపిక జరుగుతోంది. ఇందులో కథానాయికలుగా నటించేది ఎవరన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఓ కథానాయిక పాత్ర కోసం చిత్రబృందం ఇటీవల కీర్తి సురేశ్‌ని సంప్రదించినట్టు తెలిసింది. తాజాగా మరో పాత్ర విషయంలో కృతిశెట్టి పేరు వినిపిస్తోంది. ఈ వేసవిలోనే పట్టాలెక్కనున్న ఈ సినిమాలో పూర్తిస్థాయి తారాగణంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఈ సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' తర్వాత అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రమిది.

## మారుతి దర్శకత్వంలో హ్యాపీ పొంగల్?

సంక్రాంతికి 'ది రాజాసాబ్'తో ప్రేక్షకుల్ని పలకరించిన దర్శకుడు మారుతికి, ఆ సినిమా ఫలితం చేదు అనుభవాన్ని మిగిల్చింది. మరి నెక్స్ట్ ఆయన ఎవరితో సినిమా చేస్తారు? అనే విషయంపై కొన్ని రోజులుగా ఫిల్మ్‌వర్గాల్లో చర్చోపచర్చలు జరుగుతూ ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం మారుతి ఓ కథను సిద్ధం చేసుకున్నారు. మైత్రీ మూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. వరుణ్‌తేజ్, సాయిదుర్గతేజ్, రామ్ ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు హీరో అయ్యే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాల్లో టాక్ వినిపించింది. అయితే.. ఈ కథను చివరకు వైష్ణవ్‌తేజ్ ఓకే చేసినట్టు సమాచారం. ప్రస్తుతం కథల విషయంలో వైష్ణవ్ ఆచితూచి అడుగులేస్తున్నారు. ఇప్పటివరకూ ఎన్ని కథలు విన్నా ఆయన ధైర్యంగా 'ఎస్' చెప్పలేదు. కానీ మారుతీతో కలిసి నడవడానికి ఆయన సిద్ధమైనట్టు తెలిసింది. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కానున్నదని సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని మారుతి భావిస్తున్నారు. 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్‌ని కూడా రిజిస్టర్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.



Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N.Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**